honeybee.org
Vol-6 Issue-6

సంపుటి 6 సంచిక 6 సెప్టెంబర్-అక్టోబర్ 2018

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




ఆయుర్వేద జ్ఞాన మథనం

## గుండెనొప్పి నివారణకు 17 సూత్రాలు

### కష్టాలనే లాభాలుగా మార్చుకోవడం

# జ్ఞానాన్ని పంచాలా? ఫలితాన్ని పొందాలా?



ఒకసారి రైతు ఒక చీమ ఆహారాన్ని వెతుక్కుంటూ వెళ్ళడం గమనించాడు. అదలా చాలాసేపు వెతికి వెతికి చివరికి ఒక గింజను సంపాదించింది. అదా గింజను మోసుకుని వెళుతూ వుంటే మార్గమధ్యంలో దానికొక లోతైన పగులు అడ్డం వచ్చింది. చీమ ఆ పగులుని దాటి వెళ్లాలని ప్రయత్నించింది కానీ, అది పెద్దగా, లోతుగా వుంది. దాటలేకపోయింది. అప్పుడు దానికొక చిన్న ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనతో అది సునాయాసంగా తన అడ్డంకిని అధిగమించి వెళ్ళిపోయింది. చీమ తన వీపుమీదున్న గింజను పగులుకు వంతెనగా ఏర్పరచి దానిమీదుగా వెళ్ళిపోయింది.

ఆ తర్వాత చీమ గింజను ఏం చేస్తుంది? తాను తీసుకుని వెళ్ళిందా? ఆపగులుని ఎలా దాటాలా అన్న సమస్య గురించి తన తర్వాత వచ్చే చీమలు ఆలోచించవలసిన అవసరం లేకుండా ఆ గింజని వంతెనగా వాడటానికి అలాగే వదిలేసి వెళ్ళిపోయిందా? మన జీవితం ఇతులకి మార్గదర్శకం అయితే సఫలమవుతుంది.

అయితే చీమ తన బియ్యపు గింజను తనతో తీసుకుపోయినా, పగులు దాటడానికి తాను ఉపయోగించిన విధానాన్ని, జ్ఞానాన్ని వెనక వచ్చే చీమల కొరకు విడిచిపెట్టినట్లే కదా!

మీకీ కథపై వేరే ఆలోచన ఏదైనా ఉంటే మాకు వ్రాసి పంపండి. – హనీబీ 18(2) – 2007

# పల్లెసృజన

సంపుటి-6 సంచిక -6 సెప్టెంబర్-అక్టోబర్ 2018

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 800/-**
**for 5 years Subscription**

## విషయ సూచిక

గ్రామీణ మహిళలతో ఆరోగ్య రుమాళ్ళు తయారు చేయిస్తున్న 'పంచర్‌మ్యాన్' పాండురంగా రావు — 3



ఇంజనీరింగ్ విద్యార్థులతో పునాది స్థాయి ఇన్నోవేటర్ల అనుసంధానం — 14





9వ జాతీయ ద్వైవార్షిక పోటీలు బహుమతి పొందిన ఇన్నోవేషన్లు — 7

జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు — 19



పేడతో తొట్లు, పిడకలు, దుంగల తయారీ — 10





ఇంకొల్లుకు ఆపద్భాందవుడిగా మారిన మెకానిక్ బుడేసాబ్ — 25



రైతునేస్తం పురస్కారాలు — 13

ఆయుర్వేద జ్ఞాన మథనం గుండెనొప్పి నివారణకు 17 సూత్రాలు — 29



కవర్ లోపలి పేజీల్లో ... **ఎక్కువ జ్ఞానం ఉండటం మంచిదే కదా!** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **తెలంగాణ స్టార్టప్ యాత్రలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు**

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

## సంపాదకీయం

# గ్రామాల్లో వ్యవసాయాభివృద్ధికి 'పల్లె మెకానిక్'ల అజ్ఞాత కృషి

పల్లెసృజన వాలంటీర్లు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజల్లోని క్రియాశీలతను వెతుకుతుంటారు. ఇదొక అద్భుత పయనం. ఈ శోధనలో కీలకమైన వారు గ్రామ ప్రజలు. వీరిలో కొద్దిమందికే వారి గ్రామాల్లోని ఇన్నోవేటర్లను, సాంప్రదాయ జ్ఞానాన్ని గుర్తించే శక్తి వుంది. ఈ జ్ఞానం సమాజానికి ఎలా ఉపయోగపడుతుందో కూడా వారికి పూర్తిగా అవగాహన ఉంది. ఇలాంటి సంధానకర్తలైన ఊరిపెద్దలు, అనుభవజ్ఞులు పల్లెసృజన వాలంటీర్లకు తారసపడి ఇన్నోవేటర్లతో సంధానం చేస్తారు. వారందరితో జరిగే చర్చల్లో ఎంతో జ్ఞానముంటుంది. చరిత్ర ఉంటుంది, కాల గమనంలో వచ్చిన మార్పులు, వాటి వెనకాల ఉన్న సందర్భాలు, కారణాలు అవగతమవుతాయి. పదమూడేళ్ళ 'పల్లెసృజన' సంస్థ ప్రయాణంలో ఇలాంటి మహానుభావులు వేలకొద్ది వాలంటీర్లతో వారి జ్ఞానాన్ని చిరునవ్వుతో పంచుకున్నారు, ఆశీర్వదించారు.

ఇలాంటి ఒక పయనంలో పల్లెసృజన విజయవాడ శాఖలో వున్న వాలంటీరు ఏడుకొండలు ప్రకాశం జిల్లా, ఇంకొల్లు గ్రామంలో షేక్ బుడేసాబ్ అనే మెకానిక్‌ను కలవడం జరిగింది. దాని పర్యవసానమే ఈ సంచిక ప్రధాన ముఖచిత్ర కథ. ఈ అజ్ఞాత జ్ఞానఖని తన సృజనాత్మకతతో చుట్టూ వున్న రైతుల, చేపల పెంపకందారుల, గ్రామస్తుల సమస్యలను పరిష్కరిస్తూ, గత 30 సంవత్సరాలుగా ఇంకొల్లు గ్రామంతోపాటు పరిసరాల్లోని మరో వంద గ్రామాల అభివృద్ధికి పరోక్షంగా పాటు పడుతున్నాడు అంటే అతిశయోక్తి కాదు.

మహాత్మా గాంధీగారు చెప్పేవారు "ఏదైనా పని చేయాలంటే కావాల్సింది డబ్బు, శారీరక దృఢత్వం కాదు, చేయాలన్న తపన, దృఢ సంకల్పంతో పాటు తోటివారిపై అచంచలమైన ప్రేమ ఉండాలి" అని. నిజంగా షేక్ బుడేసాబ్ గాంధీగారు చెప్పిన లక్షణాలన్నీ పుణికి పుచ్చుకొని మూడు దశాబ్దాలుగా ఎందరి సమస్యలనో పరిష్కరిస్తున్నాడు. ఈవిధంగా పండ్లు పూలు ఇచ్చే చెట్టులా, అలసిపోని సూర్యుడిలా, అమాయకంగా ప్రవహించే జీవనదిలా, నిస్వార్థంగా ప్రజల శ్రేయస్సే గమ్యంగా పగలు, రాత్రి పడుకోకుండా శ్రమిస్తున్న బుడేసాబ్ లాంటి పల్లె మెకానిక్‌లు చరిత్రకారులకు కనబడరు.

భారతదేశంలో మానవ సమాజాలు అనాదిగా స్వయం సమృద్ధికై కొందరిని సాంకేతిక నిపుణులుగా తయారు చేసుకునేవాళ్ళు. ఆ క్రమంలో పుట్టినవే వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, విశ్వకర్మ, కంసాలీ, కటిక, మంగలి, చాకలి వగైరా వృత్తులు. వీరంతా గ్రామ ప్రజల సాంకేతిక అవసరాలను తీర్చడానికి సమాజ నిర్మాణ ప్రక్రియలో సృష్టించబడ్డారు. గ్రామంలోకి వచ్చే ఏ సాంకేతిక పరిజ్ఞానమైనా వీరిద్వారానే వచ్చేది. దీనివల్ల వీరు తయారు చేసిన క్రొత్త సాంకేతిక పరికరాలు వాడే గ్రామ ప్రజలకు వాటిని వాడటంలోను, రిపేరు చేయడంలోను, మార్పులు చేయడంలోను ఏ ఇబ్బంది ఉండేది కాదు. దీంతో ప్రజలు నిత్యజీవన వృత్తులను బయటి సాంకేతికతపై ఎక్కువగా ఆధారపడకుండా, ప్రశాంతంగా కొనసాగించేవారు. కాలక్రమంలో ముఖ్యంగా ఆధునిక సాంకేతిక యుగంలో గత 50 సంవత్సరాలుగా ఈ గ్రామీణ సాంకేతిక నిపుణులకు ప్రాముఖ్యతను పారిశ్రామిక ప్రపంచం, సాంకేతిక అనుమతుల వల్ల తగ్గిపోతూ వచ్చింది. చివరికి ఈ వృత్తులు గ్రామాల్లో కనుమరుగు అవుతున్నాయి. గ్రామాలు బాహ్య ప్రపంచంపై ఆధారపడటం వేగంగా పెరుగుతూ వస్తోంది.

ఈ క్రమంలో ఉద్భవించిన సాంకేతిక ఆపద్బాంధవులు మెకానిక్‌లు. తమ క్రియాశీలతతో ప్రజల కష్టాలు తీర్చాలన్న తపనతో, గ్రామంలోనే జీవనాన్ని సాగించాలన్న ఉద్దేశ్యంతో ఈ క్రొత్త వర్గము మెల్లిగా ఊరూరికీ పాకి గ్రామాలకు సాంకేతిక సహాయాన్ని అనుకోకుండా ఇవ్వడం ఒక అద్భుత పరిణామం. వీరు గ్రామాభివృద్ధికై చేస్తున్న అమూల్య సేవను, ఏ ఆర్థిక శాఖాధిపతులు, ప్లానింగ్ కమిషన్ సభ్యులు, నీతి ఆయోగ్, రాజకీయ నాయకులు, సామాజిక నాయకత్వం పూర్తిగా గుర్తించకపోవడం గమనార్హం. దేశ మూల ఆర్థిక గణాంకాలలో వీరి సేవలను పరిగణలోకి తీసుకోవటం లేదు. దాదాపు 5 లక్షల మంది ఇటువంటి గ్రామ సాంకేతిక నిపుణులకు (మెకానిక్‌లకు) ఎటువంటి సహాయం, గుర్తింపు, గౌరవం, సత్కారం ఇచ్చి ప్రోత్సహించే వ్యవస్థ మనకు లేకపోవటం, వారిని ప్రోత్సహించే పథకాలను గురించి చర్చించకపోవడం వ్యవస్థ వీరిపట్ల చేస్తున్న అన్యాయంగా తోస్తోంది.

షేక్ బుడేసాబ్ లాంటి అద్భుత వ్యక్తులు, వారు చేసే వృత్తి, వారివల్ల గ్రామాలకు తక్కువ ఖర్చుతో కలిగే ఎక్కువ అభివృద్ధిని సమాజం మనస్ఫూర్తిగా గుర్తించాలి అన్నదే 'పల్లెసృజన' ఉద్దేశ్యం. వారే సైంటిస్టులై, వారే పరిశోధకులై, వారే ఇంజనీర్లై, వారే చిన్న పారిశ్రామికులై.... అన్నీ వారే.... తమంతట తాముగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించి, గ్రామాభివృద్ధికై నిరంతరం కృషి చేస్తున్న ఈ విశిష్ట 'మెకానిక్'ల గుర్తింపుకై 'పల్లెసృజన' చేయాల్సింది చాలా వుందని విశ్వసిస్తూ, మనసారా వారిని అభినందిస్తూ....



భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

గ్రామీణ మహిళలతో ఆరోగ్య రుమాళ్ళు తయారు చేయిస్తున్న

# 'పంచర్‌మ్యాన్' పాండురంగా రావు



- పల్లె వీరరాఘవ రెడ్డి

సంగారెడ్డి జిల్లా, నారాయణ్ ఖేడ్‌లో నివసిస్తున్న 'కంటాలి పాండు రంగారావు'ది అదే జిల్లాకు చెందిన 'సుక్కల తీర్థ' అనే ఒక మారుమూల గ్రామం. 2017 లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన 'ఇన్నోఫెస్ట్' కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్వారా'ఉత్తమ ఇన్నోవేటర్' పురస్కారం పొందిన విషయం 'పల్లెసృజన' పాఠకులకు విదితమే. పల్లెవాసులు పొలానికి వెళ్ళినపుడు మోటార్ సైకిల్ పంచర్ అయితే పడే కష్టాలను కడతేర్చటానికి 'పంచర్లను నియంత్రించే ద్రావణం' కనుగొన్నందుకు ఇతనికి రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం పొందే భాగ్యం కలిగింది. నాటినుండి పంచర్లను నియంత్రించే ద్రావకం నింపిన ట్యూబ్‌లను అమ్ముకుంటూ ఉత్తమ వ్యాపారస్తుడిగా నారాయణ్‌ఖేడ్‌లో పేరు పొందాడు. ఇప్పుడు ఇతని బైకు ట్యూబులు ఎన్నో రాష్ట్రాలకు సరఫరా అవుతున్నాయి.

పాండురంగారావు తన సృజనాత్మకతను అంతటితో ఆపకుండా, గ్రామాల్లోని మహిళలకు చవకగా, నాణ్యమైన 'శానిటరీ ప్యాడ్లు' తయారు చేయాలి అనుకున్నాడు. ఇలాంటి ప్యాడ్లు తయారు చేయటానికి కొన్ని యంత్రాలు వచ్చినా, అవి కూడా లక్షల్లో ఖరీదు చేయటం వల్ల వీటిని కొని ప్యాడ్లు తయారు చేసి అమ్మాలంటే ఈ యంత్రం ఖరీదు, దానికి అవసరమైన ముడిసరుకు కలిసి ప్యాడ్లు ఎక్కువ ఖరీదుకే అమ్మాల్సి వుంటుంది. దేశంలోని చాలా చోట్ల వీటి పని తీరును గమనించాడు. లక్షలు ఖరీదు పెట్టి కొన్న యంత్రాలపై ప్యాడ్లు తయారు చేయాలంటే కూడా ఒక్కో యంత్రానికి ముగ్గురు



వ్యక్తులు పని చేయాల్సి వుంటుంది.

వీటన్నిటినీ గమనించిన పాండు కేవలం 5 లేదా 6 మంది మహిళలు ఇంట్లో కూర్చుని తీరిక సమయాల్లో ప్యాడ్లు తయారు చేసుకునేలా, యంత్రం చేసే పనులన్నిటిని గమనించి ఆ పనులు చేయటానికి విడివిడి పరికరాలు తయారు చేశాడు. ఈ ప్యాడ్‌లు రెండు రకాలుగా వుంటాయి. ఒకటి 'పల్ప్'తో తయారు చేసేదయితే మరోటి 'జెల్ షీట్'తో తయారు చేసేది. 5 మంది మహిళలు రోజుకు దాదాపు 1200 ప్యాడ్లు తయారు చేసుకోవచ్చు. వాటిని గ్రామాల్లోనే మార్కెటింగ్ చేసుకుంటే నెలకు పది వేల వరకు సంపాదన పొందవచ్చు. ఇలా ఇప్పటికే 5 చోట్ల మహిళా గ్రూపులను ఏర్పాటు చేయించి వీరిచేత శానిటరీ ప్యాడ్లు తయారు చేయిస్తున్నాడు.

ఇతని ఇన్నోవేషన్‌ను గుర్తించి ఉట్నూరుకు చెందిన 'ఐటిడిసి' సిఇవో, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్‌లు మహిళల ఉపాధి కొరకు ఈ యూనిట్లను ప్రారంభించి విజయవంతంగా పని చేసుకుని వారు లాభపడే ఏర్పాటు చేయించారు.

ఏ గ్రామం లేదా పట్టణాల్లోనైనా 5 మంది మహిళలు ఒక సమూహంగా ఏర్పడి ఒక్కసారి పెట్టుబడిగా కేవలం 40/45 వేల రూపాయలతో (ముడిసరుకు కాకుండా) ప్యాడ్లు తయారు చేసేందుకు అవసరమైన సామాగ్రిని సమకూర్చటం తో పాటు వారికి శిక్షణ కూడా ఇస్తాడు పాండురంగారావు. ఇక ఈ ప్యాడ్ల తయారీకి అవసరమైన ముడి సరుకును ఆయా సమూహాలు తయారు చేయాలనుకున్న సామర్థ్యాన్ని బట్టి తీసుకోవాల్సి వుంటుంది. ఈ ముడిసరుకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. మొత్తంమీద ఒక ప్యాడ్ 2 నుంచి 3 రూపాయల లోపలనే తయారు అవుతుంది.

ఋతుక్రమ సమయంలో మహిళలు సాధారణంగా 5 లేదా 6 పాడ్లు తీసుకుంటే చాలు ఎటువంటి ఇబ్బంది, ఇన్‌ఫెక్షన్‌లు లేకుండా ఆరోగ్యకరమైన పద్ధతిలో తమ దైనందిన పనులు సులభంగా చేసుకోవచ్చు అంటాడితను. సాధారణంగా గ్రామాల్లోని బాలికలు, స్త్రీలు వీటిని మార్కెట్‌లో కొనాలంటే నెలకు 40 నుంచి 50 రూపాయల దాకా వెచ్చించాల్సి వుంటుంది, అటువంటిది 30 నుండి 35 రూపాయల ఖర్చుతో నాణ్యమైన ప్యాడ్లు అందించే ఏర్పాటు చేస్తున్న పాండురంగా రావు ఎంతో అభినందనీయుడు.

ఈ ప్యాడ్లు ఆరోగ్యపరంగా కూడా మహిళలకు ఎటువంటి హాని కాని, అలర్జీ కాని రాకుండా వీటికి అల్ట్రా వయొలెట్ లేజర్ ట్రీట్‌మెంట్ కూడా అందించే పరికరాన్ని అందిస్తాడు. ప్యాడ్లు తయారైన తర్వాత వాటికి యూవీ ట్రీట్‌మెంట్‌ను అందించి మార్కెట్‌కు తరలించాల్సి వుంటుంది. మార్కెట్లో లభించే ప్యాడ్లకన్నా ఈ ప్యాడ్లు ఎంతో నాణ్యతతో కూడుకున్నవని, వీటిని రోజంతా ఉపయోగించినా ఎటువంటి హానీ ఉండదంటాడు పాండురంగారావు.



**భవన నిర్మాణంలో ఉపయోగించే పరికరం:**

ఇతరుల కష్టాలకు పరిష్కారం చూపేందుకు తన సృజనాత్మకతను ఎల్లప్పుడూ పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలను అందిస్తుంటాడు అనేందుకు పాండు రంగారావు తయారు చేసిన 'భవన నిర్మాణంలో ఇనుప కడ్డీలు వంచడానికి ఉపయోగించే పరికరం' మరో ఉదాహరణ.

తన మిత్రుడొకతను భవన నిర్మాణంలో పిల్లర్లకు, పైకప్పులో ఉపయోగించే ఇనుప కడ్డీలను వంచే ప్రక్రియలో ప్రావీణ్యుడు. అయితే అతను ఆ కడ్డీలను వంచటంలో విపరీతమైన చేతి నొప్పులు భరించలేక రాత్రయితే చాలు తన సంపాదనలో ఎక్కువ భాగం త్రాగుడుకు ఖర్చు చేసేవాడు. చాలాసార్లు ఈ విషయాన్ని గమనించిన పాండు, ఎందుకురా బాబూ నీ సంపాదనంతా త్రాగుడుకు ఖర్చు చేసుకుంటావు అని అడిగాడు. అందుకా మిత్రుడు 'నాకు భవన నిర్మాణానికి అవసరమైన కడ్డీలను వంచే పని మాత్రమే నాకు తెలుసు. అది చేయటంలో కలిగే శ్రమవల్ల నా చేతుల నొప్పులు భరించలేకే ఈ త్రాగుడుకు అలవాటు పడ్డాను' అన్నాడు. ఈ విషయం పాండును ఎంతగానో కృంగదీసింది. అరే మంచి మిత్రుడు ఇలా త్రాగుడుకు బానిసైపోతున్నాడే అని ఆలోచించి, ఇతని సమస్యకు ఏదైనా పరిష్కారం కనుగొనాలి అనుకున్నాడు. తన ఆరోగ్య రుమాళ్ళ వ్యాపారానికి సంబంధించిన కొంత ముడి సరుకును కొనేందుకు ముంబాయి వెళ్ళినప్పుడు అక్కడ ఒక పెద్ద భవన నిర్మాణం జరుగుతుంటే ఉత్సుకతతో ఆ కార్మికులను అడిగాడు "ఇంత పెద్ద భవనం నిర్మిస్తున్నారు కదా, ఈ కడ్డీలు వంచటానికి ఒక యంత్రం కొనలేక పోయారా" అని. దానికా కార్మికుడు "ఎందుకు కొనలేదు మా యజమాని చైనాకు చెందిన ఒక యంత్రాన్ని లక్షా ఎనభై వేలు పెట్టి





కొన్నాడు కాని, అది కొన్నిరోజులే పని చేసి పాడై పోయింది, దాన్ని రిపేరు చేసేవాళ్ళు ఎవరూ లభించక పోవడంతో మాకు ఈ చేతిపని తప్పటం లేదు" అన్నాడు. ఆ యంత్రాన్ని నాకోసారి చూపిస్తారా అన్నాడు పాండు. ఒక మూలన పడేసివున్న యంత్రాన్ని చూపించగా, ఆ పరికరంలోని ప్రతి భాగాన్ని శ్రద్ధగా గమనించాడు.

ఆ తర్వాత తన స్వగ్రామం నారాయణ్ ఖేడ్ రాగానే తాను చూసిన పరికరంలోని భాగాలను మననం చేసుకున్నాడు. ఈ పరికరం అంత ఖరీదులో వుండాల్సిన పనిలేదు కదా అని ఆలోచించి తనకున్న సృజనాత్మకతతో ప్రత్యామ్నాయ పరికరం తయారు చేయటం ప్రారంభించాడు. ఈ పరికరానికి అవసరమైన ఒక 'ఎయిర్ సిలిండర్'ను గ్వాలియర్‌కు వ్యాపార పనిమీద వెళ్ళినపుడు తీసుకు వచ్చి ఈ పరికరానికి ఏర్పాటు చేశాడు. మొత్తానికి తాను అనుకున్నంత తక్కువ ఖరీదులో ఎంతో సమర్థవంతంగా పని చేసేలా కడ్డీలను వంచే యంత్రం తయారు చేశాడు.

తన మిత్రున్ని పిలిచి ఈ పరికరం తీసుకువెళ్ళి నీ పని చేసుకో ఇక నీకు ఒళ్ళు నొప్పులు అన్న సమస్యే లేకుండా సునాయాసంగా ఒక రోజులో నువ్వు చేసే పనికి మూడింతల పని చేస్తుంది అని అతనికి ఇచ్చాడు. మామూలుగా మనిషి ఒక రోజులో 8 మి.మీ. కడ్డీలను 350 నుండి 4 వందల దాకా వంపు చేస్తే, తన మిత్రుడు ఇప్పుడు ఈ పరికరంతో కేవలం ఒక గంటలో 5 నుండి 6 వందల దాకా కడ్డీలను ఎలాంటి శారీరక అలుపు లేకుండా సునాయాసంగా వంచేస్తున్నాడు అని ఎంతో సంతోషంతో అంటున్నాడు పాండు రంగారావు.

ప్రస్తుతం కడ్డీలను వంచే యంత్రాన్ని ఈ దినసరి కూలీలు కొనుగోలు చేసుకోలేమన్నారు. భవన నిర్మాణం చేసే వారిని అడుగగా, వారు ఇంత ఖరీదు పెట్టి తీసుకు రావచ్చు



కానీ, అవి చెడిపోతే రిపేరు చేసే వారు లేరు కనుక అదో నష్టంగా భావించి కొనటం లేదని, ఆ నష్టంకన్నా ఇలా కూలీలతో పని చేయించటమే కాస్త మేలని అన్నారు.

ఇప్పుడు పాండు తయారు చేసిన ఈ పరికరం ఖరీదు 40 నుండి 45 వేల లోపల తయారవుతుందని, పైగా దీన్ని ఏ చిన్న పట్టణంలోనైనా సరే అక్కడి స్థానిక ఆటో మెకానిక్‌లు రిపేరు చేసేలా ఇందులో ప్రధాన భాగాలు ఆటోలో ఉపయోగించే వాటినే వాడానని అన్నాడు. అంటే ఇకనుండి భవన నిర్మాతలకు తక్కువ ఖరీదులోనే కడ్డీలను వంపుకునే పని జరిగి పోతుంది, పైగా కూలీలకు ఎటువంటి శ్రమ లేకుండా వుండేలా 'ఉభయ కుశలోపరి'గా ఈ యంత్రాన్ని, అదీ సాధారణ భవన నిర్మాతలు కూడా కొనగలిగే ఖరీదులో తయారు చేసిన పాండు రంగారావును 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా అభినందిస్తోంది.

భవన నిర్మాణం చేసేవారంతా ఈ పరికరాన్ని పొంది ఉపయోగించుకుని తమ నిర్మాణ ఖర్చులను తగ్గించుకోవటం తో పాటు కూలీల శ్రమను కూడా తగ్గిస్తారని ఆశిద్దాం.

**ఇన్నోవేటర్ పాండు రంగారావు, ఫోన్: 9177876554**

**పరికరం కావలసిన వారు సంప్రదించండి.**

**వీరరాఘవ రెడ్డి, ఫోన్: 8125799904**



# పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



శ్రీశైలం

యూరియా



సోలార్ స్ప్రేయర్



కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

<u>'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :</u>

77, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అభివృద్ధి చేయబడ్డ సాంప్రదాయ సజ్జ విత్తనం 'సుల్కానియా సజ్జ'

**రాష్ట్ర స్థాయి ప్రోత్సాహక బహుమతి**

**ఇన్నోవేటర్ : హనుమానరాం ఝూరియా, చూరు జిల్లా, రాజస్థాన్.**



62 సంవత్సరాల హనుమాన్‌రాం రాజస్థాన్, చూరు జిల్లాలో గల 'సుల్కానియా' గ్రామంలో గత 40-45 సంవత్సరాల నుంచి ఉత్తమమైన గింజల ఎంపిక పద్ధతిలో సజ్జలు పండిస్తున్నాడు. తాను పండించే సజ్జలకి తన గ్రామం పేరే 'సుల్కానియా సజ్జలు' అని పెట్టుకున్నాడు. పొడవైన కంకులు కలిగి వుండి, తియ్యటి గింజలు కలిగి, ఎక్కువ దిగుబడినివ్వటం, కరువు పరిస్థితులను తట్టుకోవటం, ఎక్కువ పశుగ్రాసం ఇవ్వటం ఈ సుల్కానియా సజ్జల ప్రత్యేకత.

హనుమాన్‌రాం కుటుంబం గత ఎన్నో శతాబ్దాల నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి వుంది. ప్రస్తుతం హనుమాన్‌రాం తన 4 హెక్టార్ల పొలంలో ఈ 'సుల్కానియా సజ్జ'నే పండిస్తున్నాడు. వ్యవసాయంలో అతనికి భార్య, ఐదుగురు పిల్లలు సహాయకారిగా వుంటారు. తనకున్న 4 హెక్టార్లలో 2 హెక్టార్లు విత్తనం కోసం, మిగిలిన రెండు హెక్టార్లలో తన స్వంత వాడకానికి, మిగిలితే అమ్ముకోవటానికి వజ్జలు వేస్తాడు. హనుమాన్‌రాం తాత ముత్తాతలు కూడా ఈ రకమైన సజ్జలనే పండించేవారట. బికనీర్ నుంచి వచ్చిన ఒక ఆధ్యాత్మిక గురువు 300 సంవత్సరాల క్రితం వీరి ముత్తాతకి ఈ విత్తనం ఇచ్చారట! అప్పటినుండి అదే రకాన్ని వీరి కుటుంబం పండిస్తున్నారట. హనుమాన్‌రాం గత 45 సంవత్సరాల నుండి మేలైన గింజలను ఎంపిక చేసి, ప్రత్యేకమైన పంటగా వేస్తూ ఉత్తమమైన సజ్జ రకాన్ని 'సుల్కానియా' అనే పేరున రైతులకు అందజేస్తుంటాడు. ప్రతి సంవత్సరం పంట వచ్చిన తర్వాత ఆరోగ్యంగా వున్న గింజలను ఏరి, ఎండిన వేపాకులతో కలిపి నిలువ చేస్తాడు. ఈవిధంగా 5 సంవత్సరాల వరకు నిలువ చేసుకోవచ్చు అంటాడితను.

ఈ 'సుల్కానియా' సజ్జ తొలకరి వర్షాలకు విత్తుకునే



రకం. ఇది ఇసుకమట్టి నేలలు, నీరు తక్కువగా వున్న ప్రాంతాలలో, సమ ఉష్ణ ప్రాంతాలలో కూడా విత్తటానికి అనువైన రకం. వర్షపాతం తక్కువైన కరువు వాతావరణాన్ని కూడా తట్టుకుంటుంది. విత్తిన తర్వాత కొంత కాలం వర్షం లేకపోయినా ఇది బాగా మొలకెత్తి ఎదుగటం దీని ప్రత్యేకత. ఈ లక్షణాలు సాధారణ సజ్జ రకాలలో వుండవు.

ఈ రకం సజ్జతో హెక్టారుకు 20 నుండి 25 క్వింటాళ్ళ వరకు దిగుబడి సాధించవచ్చు. పొడవాటి కంకులు, రుచిలో తియ్యదనం, గింజలు ఒత్తుగా వుండటం దీని ప్రత్యేకత. ప్రతి మొక్కకు 6 నుండి 10 కంకులు వస్తాయి. ప్రతి కంకిలో 90 శాతానికి పైగా మంచి బలమైన విత్తనాలే వుంటాయి. విత్తిన 90 రోజులకే పంట కోతకు వస్తుంది. హెక్టారుకు 40 క్వింటాళ్ళ వరకు పశుగ్రాసం లభిస్తుంది.

వర్షాధారం బాగా వుంటే ఈ రకంలో ఇంకా ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చునని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు. ఇది సాధారణ రకంకన్నా ఎక్కువగా చీడ పీడలను తట్టుకునే శక్తి కలిగి వుంటుంది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో క్షేత్ర స్థాయిలో జరిపిన పరిశోధనా ఫలితాలను బట్టి చూస్తే వర్షాభావ పరిస్థితులలోనే మంచి ఫలితాలను ఇస్తున్న ఈరకం కొద్దిగా వర్షాలు ఎక్కువున్న ప్రాంతాలలో మరింత మెరుగైన ఫలితాలు ఉండవచ్చని అనుకుంటున్నారు రైతులు.

గతంలో ఒకసారి సిల్కానియా గ్రామంలో 'సుల్కానియా సజ్జలు' పండించే రైతుల సదస్సును ఏర్పాటు చేయగా చుట్టుప్రక్కల గ్రామాలనుండి సుమారు 40 మంది రైతులతో పాటు, శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్ర అధికారులు, సెంటర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ నుండి నిష్ణాతులు హాజరయ్యారు. వారిముందు రైతులు హనుమాన్ రాం రూపొందించిన ఈ సజ్జ రకం ఇతర రకాల విత్తనాల కన్నా చాలా మేలైనవని, అధిక దిగుబడిని ఇస్తున్నాయని, చీడ పీడలను బాగా తట్టుకోగలవని, తాము కూడా దాదాపు 30 సంవత్సరాల నుండి ఆ విత్తనాలే వేస్తున్నామని వెల్లడించటం జరిగింది. వచ్చిన అధికారులు, శాస్త్రవేత్తలు కూడా పండించిన పంటని పరిశీలించి, పొడవైన కంకులను గుర్తించి, మేలు రకం





Extralongearheads of *Sulkhaniyabajra*

విత్తనాల రుచి చూసి, తాము చూసిన అనేక రకాలకన్నా ఇవి ఉత్తమమైనవని నిగ్గు తేల్చారు.

సుల్కానియా గ్రామం చుట్టుప్రక్కల చురు జిల్లాలో 100-120 కి.మీ. పరిధిలో రైతులకి ఈ విత్తనాలు సరఫరా చేశాడు హనుమాన్‌రాం. అంతే కాక, చుట్టుప్రక్కల జిల్లాలైన ఝుంఝూ, సికర్, నాగోర్, బికనీర్, జైపూర్ జిల్లాలో కూడా కొందరు రైతులకి ఈ విత్తనాలు అందజేయగా చాలా బాగున్నాయని, బైట మార్కెట్‌లో లభించి హైబ్రిడ్ విత్తనాలకన్నా ఇవి ఎన్నోరెట్లు ఉత్తమంగా వున్నాయని రైతులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ముఖ్యంగా అధిక దిగుబడి, రుచి, అధిక పశుగ్రాసం, చీడ పీడలను తట్టుకోవటం, వర్షాభావ పరిస్థితుల్లో కూడా దిగుబడి తగ్గకపోవటము మొదలైన లక్షణాలు రైతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇతని వద్దనుంచి విత్తనాలు తీసుకున్న రైతులు తమవద్దకు




విత్తనాలకు ఎవరైనా వస్తే వారంతా ఏకగ్రీవంగా హనుమాన్ రాం గత ఎన్నో సంవత్సరాలుగా ఈరకమైన విత్తనాలపై ప్రయోగాలు చేస్తున్నాడు, మీరు విత్తనాలకై అతని వద్దకే వెళ్ళండి అని చెప్తారట.

హైబ్రిడ్ విత్తనంగా కాకుండా సాంప్రదాయ పద్ధతిలోనే 300 సంవత్సరాల నుండి కృషి సలిపి శ్రేష్ఠమైన సజ్జ విత్తనాలను రైతాంగానికి అందిస్తున్న హనుమాన్‌రాం జాతీయ స్థాయి బహుమతికి అర్హుడే అని 'పల్లెసృజన' బృందం ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో 2017 మార్చిన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలోనే హనుమాన్‌రాంను అభినందించింది.

విత్తనాలు కావలసిన వారు **వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 8125799904** ని సంప్రదించండి.

# ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 800/-లతో 5 సంవత్సరాల పాటు గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

మీ గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక మీ గ్రామానికి వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

– ఎడిటర్

# పేడతో తొట్లు, పిడకలు, దుంగల తయారీ



## గుజరాత్‌కు చెందిన ఇన్నోవేటర్లు తయారు చేసిన సరికొత్త యంత్రాలు

పేడ లేని గ్రామం లేదు. పేడను ప్రజలు ఎన్నో రకాలుగా వాడుకుంటారు. ముఖ్యంగా పిడకలు చేయడం. ఈమధ్య జీవామృతం తయారీలో పేడను ఉపయోగి స్తున్నారు. అయితే గుజరాత్‌కు చెందిన ఇన్నోవేటర్లు పేడతో పూలతొట్లు తయారు చేయడానికి, సులభంగా పిడకలు చేయటానికి, శ్మశానాల్లో కట్టెల బదులు శవాలను కాల్చేందుకు పేడ దుంగలు తయారు చేసేందుకు యంత్రాలను కనుగొన్నారు. వీటి వివరాలను పాఠకుల కోసం అందిస్తున్నాం.

**పేడతో నర్సరీ తొట్ల తయారీ:**

నర్సరీలలో మొక్కలు పెంచటానికి పూర్వం సాంప్రదాయంగా మట్టి తొట్లను వాడేవారు. మట్టి పాత్రలలో మొక్కలకు పోసిన నీరు సూక్ష్మ రంధ్రాల ద్వారా గాలిలో కలిసి మొక్క కూడా ఆరోగ్యంగా పెరిగేది. మట్టి తొట్ల తయారీ, వాడకం తగ్గిపోయింది. ప్లాస్టిక్ కవర్ల వాడకం ఇప్పుడు ఎక్కువైపోయింది. ప్లాస్టిక్ వాడటం వలన అది భూమిలో కలిసిపోక పోవటం, ప్లాస్టిక్ కవర్లలోని మట్టిలో పోసిన నీరు బయటకు వెళ్లే మార్గమే లేక అక్కడక్కడే వుండటం వల్ల మొక్కలకు ఆరోగ్యకర వాతావరణం అందే అవకాశం లేక మొక్కలు సరియైన పోషకాలతో పెరిగే అవకాశం తక్కువ. పైగా ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం కూడా పెరిగిపోతున్నది. మొక్క మొలకెత్తిన తర్వాత పెరిగేకొద్దీ వాటి వేరు వ్యవస్థ విస్తరణకు ప్లాస్టిక్ ప్రతిబంధకంగా వుంటుంది. ఇన్ని రకాల ఇబ్బందులను అధిగమించటానికి వీటికి ప్రత్యామ్నాయంగా 'పరేష్ పంచాల్' అనే అహమ్మదాబాద్‌కు చెందిన ఇన్నోవేటర్ పశువుల పేడ మరియు వ్యవసాయ వ్యర్థాలను మేళవించి నర్సరీ తొట్టెల తయారీకి ఒక పరికరాన్ని రూపొందించాడు. ఈ తొట్టె మట్టిలో కలిసిపోవటమే కాక, దీనివల్ల రెండు రకాల లాభాలున్నాయి. మొదటిది, ప్రధానమైనది పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం






తగ్గిపోతుంది. రెండవది ఇదే ఆ మొక్కకు ఎరువుతో పాటు, క్రిమి సంహారిణిగా కూడా పనిచేస్తుంది. మట్టితో చేసే తొట్లను కాల్చటానికి మళ్ళీ కట్టెలు వాడాల్సిన అవసరం వుంటుంది, అవి పగిలిపోయినా మళ్ళీ మట్టిలో కలవాలంటే చాలా రోజులు పడుతుంది. కానీ ఈ పేడ తొట్లు మట్టిలో త్వరగా కలిసిపోతాయి.

ఈ పరికరాన్ని సులభంగా వాడుకోవచ్చు. దీనితో మూడు రకాల సైజుల్లో తొట్టెలను తయారు చేసుకోవచ్చు. చిన్నవి - 3.2 అంగుళాల వెడల్పు, 3.5 అంగుళాల ఎత్తు, 0.4 అంగుళాల మందంతో చేసుకోవచ్చు. మధ్యరకం తొట్టెలు - 6 అం. వెడల్పు, 5.2 అం. ఎత్తు, 0.6 అం. మందంతోను, పెద్ద తొట్టెలు - 7 అం. వెడల్పు, 8 అం. పొడవు, 0.7 అం. మందంతో తయారు చేసుకోవచ్చు.

ఎలాంటి ఇంధనము, కరెంటు అవసరం లేకుండా కేవలం మానవ శక్తితోనే పనిచేసే ఈ పరికరంతో గంటకి 100 వరకు తొట్టెలను తయారు చేసుకోవచ్చు. రూ. 18000 వరకు ఖరీదు చేసే ఈ యంత్రం ఆర్డరు చేసిన 15 రోజుల్లో అందజేయ బడుతుంది.




కావలసిన వారు “దేవాంగ్ కంబాటియా, సెల్ నెం. 0904646555 లేదా 9824079439లలో సంప్రదించి కాని లేదా 'పల్లెసృజన' (వీరరాఘవ రెడ్డి 8125799904) ను సంప్రదించి కాని పొందవచ్చును.

**పిడకల తయారీ యంత్రం:**

పూర్వం పశుగ్రాసమున్న ప్రతి రైతు కుటుంబం తప్పనిసరిగా పిడకలను తయారు చేసుకునేది. వీటిని వంట చెరుకుగా విరివిగా వాడేవారు. మరీ ముఖ్యంగా వీటిని పాలు కాచేందుకు తప్పనిసరిగా వినియోగించేవారు. అందుకేనేమో నాటి పాలు, పెరుగు, మజ్జిగల రుచి ఇప్పటికీ మధుర స్మృతిగానే ఉండిపోయింది. మారుతున్న కాలం దృష్ట్యా పిడకలు తయారు చేసేవారు కరువవటంతో వాటిని దాదాపు మరచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇక ధార్మిక కార్యక్రమాలు, యజ్ఞ యాగాదుల్లో వీటి ఉపయోగం తప్పనిసరి. ఇవి ప్రస్తుతం లభించక 'ఆన్‌లైన్'లో కొనే పరిస్థితి దాపురించింది. ధాన్యం నిలువ చేసే గాదెలలో కూడా పిడకలను వాడటం కొన్ని ప్రాంతాలలో జరిగేది.

ప్రస్తుత తరం పేడ పిసికి పిడకలు చేయటం






నామోషీగా భావిస్తున్న ఈ సమయంలో గుజరాత్‌కి చెందిన 'మన్సుక్ భాయ్ ప్రజాపతి' ఈ పిడకలు తయారు చేసేందుకు ఒక చిన్న పరికరాన్ని రూపొందించాడు. దీనితో ఒకే సైజు, ఒకే మందంలో గల పిడకలు తయారు అవుతాయి. కేవలం మానవ శక్తితోనే పనిచేసే ఈ పరికరం వివిధ రకాల అచ్చులు (డై) ఉపయోగించి రెండు మూడు అంగుళాల వ్యాసార్థం కల పిడకలను తయారు చేసుకోవచ్చు. పేడలో గడ్డి లాంటి వ్యవసాయ వ్యర్థాలను కలపడం ద్వారా ఇవి బాగా మండటమే కాకుండా ఎక్కువ సెగ కలిగి వుంటాయి. వ్యర్థాలను కూడా వృధాగా పోకుండా వాడుకోవచ్చు.

పూజలకి, యజ్ఞ యాగాదులకి పనికి వచ్చేలా పేడలో గుగ్గిలము, కర్పూరము, చందనములను కలిపి ప్రత్యేకమైన పిడకలను కూడా తయారు చేసుకోవచ్చు. వీటిని కలపటం వల్ల మంచి సువాసనను ఇవ్వటమే కాకుండా దోమలను కూడా పారద్రోలే స్వభావం కలిగి వుంటాయి. అర అంగుళం మందంలో గల పిడకలను తయారు చేసుకోవచ్చు. ఒక యంత్రం ఖరీదు రూ. 6,000లు వుంటుంది. ప్యాకేజింగు, రవాణా ఖర్చులు, పన్నులు అదనం. ఆర్డరు చేసిన 20 రోజులలో ఈ యంత్రం అందజేయ బడుతుంది.

కావలసిన వారు 'గుజరాత్ గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్ ఆగ్‌మెంటేషన్ నెట్‌వర్క్' టెలిఫోన్ నెం.: 079-26760398 లో లేదా 'పల్లెసృజన' (వీరరాఘవ రెడ్డి 8125799904)లో సంప్రదించి పొందవచ్చు.

**పేడతో దుంగల తయారీ:**

సనాతన హిందూ ధర్మం ప్రకారం పార్థివ శరీరాన్ని (శవాన్ని) కాల్చటం ఒక సాంప్రదాయం. దీనికై కట్టెలు కాని, కరెంటు కాని, ఎల్‌పిజి గ్యాస్‌ను కానీ వాడటం జరుగుతూ వుంటుంది. కాలక్రమేణా వీటి ధరలు పెరిగిపోవటమే కాక, పర్యావరణానికి కూడా హాని జరుగుతూ వుండటాన్ని గమనించి అహమ్మదాబాద్‌కు చెందిన 'మన్సుఖ్‌భాయ్ ' అనే ఒక రైతు ఆవు పేడతో చేసిన కట్టెల లాంటి దుంగలను తయారు చేయటం ప్రారంభించాడు.

దానికి తగ్గట్టుగానే ఈయన పేడతో గడ్డిని కలిపి ఈ దుంగలను తయారు చేశాడు మన్సుఖ్ భాయ్. మామూలు కట్టెలు ఇతర పదార్థాలకన్నా ఇది చవక. వీటిని తయారు చేయటానికి ఈయన ఒక చిన్న యంత్రాన్ని రూపొందించాడు.

ముందుగా పేడలో, గడ్డి లేదా పొలాల్లో లభించే వ్యర్థాలను కలిపి ఈ యంత్రంలో వేస్తే ఒక 'మర' లాంటి పరికరం సహాయంతో 'దుంగ' రూపంలో బయటికి వస్తుంది. మన అవసరాన్ని బట్టి ఏ సైజులోనైనా ఈ దుంగలను తయారు చేసుకోవచ్చు. వీటిని ఎండబెట్టిన తర్వాత కట్టెలకు ప్రత్యామ్నాయంగా శవాలను కాల్చడానికి వాడుకోవచ్చు.

ఈ యంత్రం వలన గోశాలల్లోని పేడకు విలువను పెంచి ఎక్కువ ఆదాయం పొందే అవకాశముంది. ఈ యంత్రాన్ని నడపటం చాలా సులభం. స్త్రీలు కూడా సునాయాసంగా నడుపవచ్చు. మన అవసరానికి తగ్గట్టు దుంగల సైజును మార్చుకోవచ్చు. వీటిని చిన్న ముక్కలుగా చేసి పొయ్యిలో వంట చేసుకోవటానికి ఉపయోగించుకుంటే వంటల రుచిలో కూడా తేడా వుంటుంది. ఆరోగ్యానికీ ఎంతో






మంచిది. వీటిని హోమ గుండాలలో కూడా వాడుకోవచ్చు. చెట్లను సంరక్షించుకొని పనికి రాని వ్యర్థాలతో పేడను కలిపి చేసుకోవటం వల్ల పర్యావరణం కూడా కొంతవరకు కాపాడ బడుతుంది. దీనివల్ల ఉత్పన్నమయ్యే వేడి చాలా ఎక్కువగా (3522 కేసిఎల్ /కెజి.) ఉంటుంది కనుక పరిశ్రమలలో కూడా వాడుకోవచ్చు. ఒక హెచ్‌పి మోటార్‌తో పనిచేసే ఈ యంత్రం సాయంతో గంటకి (3అంగుళాలు వెడల్పు, 3 అంగుళాలు మందము, 3 అడుగుల పొడవు) 50 నుంచి 60 వరకు దుంగలను తయారు చేసుకోవచ్చు. మాడల్-1 యంత్రము రూ. 25,000/-, మాడల్-2 యంత్రం రూ. 30,000/- ఉంటుంది. ప్యాకింగు, రవాణా ఖర్చులు అదనం. డబ్బు పంపిన 15 రోజులలో యంత్రం అందజేయ బడుతుంది. కావలసినవారు 'దేవాంగ్ కంబాటియా', సెల్ నెం. 9904646555 లేదా 8125799904 సంప్రదించ గలరు.

గోశాలలు, డైరీ ఫారంలు, పాడి పశువులు సమృద్ధిగా వున్న పెద్ద రైతులకు లభ్యమయ్యే పేడను సులభంగా వ్యాపారాత్మకంగా పైన తెలిపిన పేడను ఉపయోగించే మూడు యంత్రాలు వినియోగించుకుని ఆదాయం పెంచుకోవటానికి తోడ్పడుతాయి. ఈ యంత్రాలు, పరికరాలు కావలసిన వారు క్రియేటివ్ మైండ్స్ 040-27111959 (కనకరాజు) లేదా వీరరాఘవ రెడ్డి 8125799904 ఫోన్లలో సంప్రదించి తెప్పించుకోవచ్చు.

## రైతునేస్తం పురస్కారాలు అందుకున్న 'పల్లెసృజన' ఇన్నోవేటర్, ఎడిటోరియల్ సభ్యుడు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయ పత్రికలలో పేరుగాంచిన 'రైతునేస్తం' పత్రిక ప్రతి సంవత్సరం రైతు లోకానికి సేవలందించిన వివిధ విభాగాల ప్రతినిధులకు సత్కారాలను అందజేస్తూ వుంటుంది. ఈ పరంపరలో ఇప్పటికే కొందరు 'పల్లెసృజన' సభ్యులు ఎంతోమంది పురస్కారాలను గైకొనటం జరిగింది. 'పల్లెసృజన' ఇన్నోవేటర్ గల్లా చంద్రశేఖర్‌ను వివిధ పంటలలో నిమటోడ్స్ నివారణకు మందు కనుగొన్నందుకు, అలాగే పల్లెసృజన పత్రికలో ఎడిటోరిల్ బోర్డు సభ్యుడైన పల్లె వీర రాఘవ రెడ్డిని పత్రికలో రైతాంగానికి ఎంతో విలువైన సమాచారం అందించినందుకు 2018 పురస్కారాలకు ఎంపిక చేశారు. అక్టోబర్ 7న ఈ పురస్కారాలను భారత ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు గారి చేతులమీదుగా చంద్రశేఖర్, వీర రాఘవ రెడ్డిలు అందుకున్నారు. కార్యక్రమంలో 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం, ఎడిటర్ జె. శశిమోహన్, గ్రామబజార్ సిఇవో జాగర్లమూడి దుర్గాప్రసాద్, 'పల్లెప్రగతి' పోచా చిన్న నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## సి.ఎం.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో

# ఇంజనీరింగ్ విద్యార్థులతో పునాది స్థాయి ఇన్నోవేటర్ల అనుసంధానం

దేశంలో ఎక్కడా లేనంతగా తెలుగు రాష్ట్రాల్లో మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు 'పల్లెసృజన' చేస్తున్న పనికి ముగ్ధులై తమ కళాశాలల్లో పునాది స్థాయి ఇన్నోవేషన్ల ప్రదర్శనకు సమున్నత స్థానాన్ని కల్పిస్తున్నాయి అని చెప్పక తప్పదు.

అయిదు సంవత్సరాల క్రితం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ఇంజనీరింగ్ విద్యలో భాగంగా ప్రతి విద్యార్థి ఒక 'ప్రాజెక్ట్ రిపోర్ట్'ను సమర్పించాల్సి వుంటుంది. గతంలో ఈ ప్రాజెక్ట్ రిపోర్టు తయారు చేయటం కోసం అధ్యాపకులే వారి చేత ఏ పరికరం చేయించే ప్రాజెక్టు తయారు చేయాలో చెప్పి, అందుకు సంబంధించిన పాత పరికరం యొక్క నమూనాలను ఇచ్చి వాటికే కొంత మెరుగులు దిద్దే ఏర్పాటు చేయించి, వారిచేత ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయించి మార్కులు వేసేవారట!

'పల్లెసృజన' వెలుగులోకి వచ్చిన తర్వాత ఈ వ్యవస్థ సమూలంగా మారిపోయే రోజులు వస్తున్నాయన్న సూచనలు కనబడుతున్నాయి. ఇప్పుడు ఇంజనీరింగ్ విద్యార్థులకు వారి జ్ఞానానికి, ఆలోచనకు దగ్గరగా వున్న అన్ని రకాల ఇన్నోవేషన్లు వారిముందు ప్రదర్శించ బడుతున్నాయి. బ్రిగేడియర్ గణేశం గారు ఇంజనీరింగ్ కళాశాలల్లో చెప్పే బోధనాంశాలు విద్యార్థుల మదుల్లో సుడులు తిరుగుతున్నాయనిపిస్తోంది. అందుకు ప్రత్యక్ష ఉదాహరణే నేటి ఈ 'సిఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ల ప్రదర్శన'.

ప్రదర్శన మొదలైనప్పటినుంచి నిర్విరామంగా 5 గంటల పాటు విద్యార్థులు పునాది స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలిస్తున్న, ఇన్నోవేటర్లతో తెలుసుకుంటున్న వివరాలను బట్టి అర్థమైంది. దాదాపు కళాశాల విద్యార్థినీ విద్యార్థులంతా ఎంతో జిజ్ఞాసతో ఇన్నోవేషన్లను పరిశీలించారు. వాటి పని తీరును, అవి తయారు చేయటానికి ఇన్నోవేటర్లను పురిగొల్పిన కథనాలను విని ముగ్ధులైపోయారు.

కార్యక్రమం చివరలో ఇన్నోవేటర్లకు సముచిత సన్మాన కార్యక్రమం అనంతరం 'పల్లెసృజన' వ్యవస్థాపకులు బ్రిగేడియర్ పోగుల గణేశం విద్యార్థులు ఈ ఇన్నోవేటర్ల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు, భవిష్యత్‌లో సమాజ అవసరాలను వారి నైపుణ్యతతో తయారు చేయాల్సిన ఇన్నోవేషన్లు ఎలా వుండాలో తెలియజేసి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని కల్పించారు. ఆయన చేసిన ప్రసంగాన్ని విన్న కళాశాల అధ్యాపక బృందం కూడా ఎంతో సహృదయంతో అంగీకరించి, ఇక నుండి తమ



భవిష్యత్ కార్యక్రమాల తీరే మారేలా చేసింది 'పల్లెసృజన' అని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ 'వేణుమాధవ్' గారు మాట్లాడుతూ "పునాది స్థాయి ఇన్నోవేషన్లను మా ఇంజనీరింగ్ విద్యార్థులు చూసేలా ప్రదర్శన ఏర్పాటు చేస్తే కొంత వరకు ఉపయోగ కరంగా వుంటుందని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే, కొంత వరకు కాదు, సమాజ శ్రేయస్సు కొరకు మా విద్యార్థులు ఎలాంటి ఇన్నోవేషన్లు భవిష్యత్‌లో తయారు చేయాలో నేర్పింద"ని అన్నారు.

కళాశాల అధ్యాపకులలో ఒకరైన చంద్రశేఖర్ గారు మాట్లాడిన తీరు విద్యార్థుల మదిలో ఎప్పటికీ గుర్తుండి పోతుంది అనటంలో ఎలాంటి సందేహం లేనంతగా మాట్లాడారు. అతని మాటల్లోనే.... "నేను ఈ ప్రదర్శన ఏర్పాటు చేయబోతున్నామని యాజమాన్యం చెప్పినపుడు ఒహో గ్రామీణ ఇన్నోవేటర్లకు మన విద్యార్థులు సలహాలు, సూచనలు, పాఠాలు ఇస్తారా?, సరే మంచిదే కదా అనుకున్నాను. ప్రదర్శనలోని రెండు స్టాళ్ళను చూసిన తర్వాత విద్యార్థులు ఇన్నోవేటర్లకు పాఠాలు చెప్పటం కాదు, విద్యార్థులే వీరినుండి పాఠాలు నేర్చుకోవాలి అనుకున్నాను. మరో నాలుగు స్టాళ్ళు చూసిన తర్వాత విద్యార్థులు కాదు అధ్యాపకులే వీరినుండి తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో వున్నాయి అనిపించింది" అన్నారు. విద్యార్థులకు మార్గనిర్దేశకత్వం చేస్తూ "పునాది స్థాయి ఇన్నోవేటర్లు ఏమాత్రం ఇంజనీరింగ్ పరిజ్ఞానం లేకుండా, కనీస స్థాయి చదువు లేకుండా, వారికి అందుబాటులో వున్న వస్తువులతోనే ఇన్ని రకాల ఆవిష్కరణలు చేశారే, మరీ మీకు చదువు వుంది, మీకు అందుబాటులో మీ ఇంట్లోనే ఎన్నో రకాల వృధాగా పడిపోయిన ఎలక్ట్రానిక్స్ పరికరాలున్నాయి, వీటితో మీరేం తయారు చేయాలో ఒక్కసారి ఆలోచించండి. మీరు తలుచుకుంటే సమాజానికి ఎన్నో ఉపయోగకరమైన పరికరాలు అందుబాటులోకి వస్తాయి" అని వారిని ఉత్తేజితులను చేశారు. అంతే కాదు "విద్యార్థులంతా మీరు ఈరోజు చూసిన ఈ ప్రదర్శన గురించి తప్పకుండా రెండు పేజీలకు తక్కువ కాకుండా మీ అభిప్రాయాలను తెలియజేస్తూ ఒక నివేదిక ఇవ్వాలి" అని సూచించారు.

కార్యక్రమంలో ఇన్నోవేటర్లు, వాలంటీర్లతో పాటు వ్యవస్థాపకులైన బ్రిగేడియర్ గణేశం గారిని సహృదయంతో సత్కరించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యానికి 'పల్లెసృజన' తరుపున బ్రిగేడియర్ గణేశం గారు ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రదర్శన




# తెలంగాణ స్టార్టప్ యాత్ర లో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

స్టార్టప్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 4 వరకు, 12 తెలంగాణ జిల్లాల్లో నిర్వహించిన 'తెలంగాణ స్టార్టప్ యాత్ర' లో 'పల్లెసృజన' ప్రధాన భూమిక పోషించింది. ఈయాత్రలో పల్లెసృజన యాభై గ్రామీణ ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. 14 మంది ఇన్నోవేటర్లు వేరువేరు స్థలాల్లో అనేకమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక రైతులు, అధికారులు, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక వేత్తలు మన ఇన్నోవేటర్లతో సంప్రదింపులు జరిపారు. ఈ ఇన్నోవేషన్లు ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తాయో వివరంగా తెలుసుకున్నారు. అవసరమైతే మాకు సరఫరా చేస్తారా అని ఎంక్వయిరీ చేసారు. అపరిష్కృతంగా వున్న వారి సమస్యలను ఇన్నోవేటర్లతో చర్చించి పరిష్కారాలను వెతకడానికి ప్రయత్నం చేశారు. ఈవిధంగా అన్ని వర్గాల ప్రజలు, గ్రామ ఇన్నోవేటర్లతో ముఖాముఖి చర్చలు జరపడానికి ఈ యాత్ర ఎంతగానో దోహదపడింది. కొందరు యువకులు ఇన్నోవేషన్లను వారి ప్రాంతాలలో విక్రయించడానికి ముందుకు వచ్చారు. చాలామంది గ్రామ యువత సరళమైన, అతి ఉపయోగవంతమైన గ్రామీణ ఇంజనీర్ల ఆవిష్కరణలను పరిశీలించి, దిగ్భ్రాంతి చెందారు. వారికి ఎంతో ప్రోత్సాహకరంగా ఈ ప్రదర్శన ఫలప్రదంగా జరిగింది.

12 తెలంగాణ జిల్లాల్లోని వేలాదిమంది ప్రజల వద్ద ఈ ఇన్నోవేషన్ల ప్రదర్శన మంచి పరిణామం. రైతులు ఆవిష్కరించిన సులభమైన, అందుబాటులో ఉండే సాంకేతిక పరిష్కారాలు, చాలా మంది గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఇది ఇన్నోవేటర్లలోలో ఒక విధమైన ఆత్మ విశ్వాసాన్ని పెంచిందని పల్లెసృజన భావిస్తోంది. ఇలాంటి ప్రదర్శనలు సమాజంలోని ప్రతి వ్యక్తి చూడాలని, ఇలాంటి ప్రదర్శనలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయించాలని పల్లెసృజన తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. వచ్చే అయిదు సంవత్సరాల్లో తెలంగాణలోని ప్రతి గ్రామానికి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల ప్రదర్శనను తీసుకొని వెళ్తామని ప్రభుత్వ ప్రతినిధులు స్టార్టప్ యాత్ర ఆవిష్కరణ సభలో హామీ ఇచ్చారు.

'పల్లెసృజన' ప్రధాన ఉద్దేశ్యాల్లో ఆవిష్కరణల విస్తరణ ఒకటి. ఈ ఉద్దేశ్యం తెలంగాణ స్టార్ట్ ఆప్ ద్వారా చాలావరకు నెరవేరడం పల్లెసృజనకు ఎంతో ఆనందాన్నిచ్చింది. భవిష్యత్తులో తెలుగు ప్రజలందరికీ వారి గ్రామాల్లో రైతుల ఇన్నోవేషన్‌లు చూసే అవకాశం కలగాలని పల్లెసృజన మనసారా ఆశిస్తున్నది.

తెలుగు రాష్ట్రాల్లోని ఏ సంస్థయినా, కళాశాలలయినా, మండలాలు, కలెక్టరేట్లయినా, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలైనా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల ప్రదర్శన వారి ప్రాంతంలో ఏర్పాటు చేయాలనుకుంటే 'పల్లెసృజన' (వీర రాఘవ రెడ్డి, ఫోన్ 81257 99904)ను సంప్రదరించ గలరు.




















# ప్రదర్శన

















# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అధిక దిగుబడినిచ్చే 'బల్వాన్' ఉల్లి రకం

**ఆవిర్భావం :**

హర్యానాలో గత ఎన్నో సంవత్సరాలుగా బల్వంత్ సింగ్ ఉల్లిగడ్డను పండిస్తూ వుండేవాడు. దిగుబడి సరిగ్గా రాని కారణంగా దిగుబడిని పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. స్థానికంగా లభించే రకాలలో మంచి రకాన్ని సేకరించి, అనేక ప్రయత్నాలు చేసి, పది సంవత్సరాల సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత చివరికి 1984లో ఒక రకాన్ని స్థిరీకరించి, దానికి 'బల్వాన్ ఉల్లి' అని నామకరణం చేశాడు. స్థిరీకరించడానికి అతను ఉపయోగించిన ముఖ్య సూత్రాలు మూడు. 1. ఉల్లిగడ్డ మంచి సైజులో ఉండాలి, 2. పైపొర త్వరగా తీయటానికి రాకుండా ఉండాలి (త్వరగా ఎండిపోకుండా ఉండేందుకు), 3. మంచి ఎర్రని రంగు కలిగి వుండాలి.



**ప్రత్యేక లక్షణాలు :**

- పైపొర గట్టిగా గడ్డను అతుక్కొని ఉండటం వలన లోపలి పొరలు త్వరగా ఎండిపోవు.
- లోపలి పొరలు మందంగా ఉంటాయి.
- గడ్డ ఏకంగా వుంటుంది. భాగాలు (పాయలు)గా ఉండదు
- కాండం కుళ్ళు తెగులును సమర్ధవంతంగా ఎదుర్కొంటుంది.
- 98% వరకు మొలకెత్తుతాయి.

**వాతావరణ అనుకూలత :**

చల్లటి వాతావరణం అనుకూలం (సమతల వాతావరణం). వార్షిక వర్షపాతం 750 నుండి 1000 మి.మీ. చాలు.

**ఇతర లక్షణాలు :**

ఒక ఏడాది వరకు గడ్డలను నిల్వ చేసుకోవచ్చు. నిర్ణీత కాలంలో వేసుకునే పంట.

**ధర :**

కిలో విత్తనాలు రూ. 5,000/- (ఎకరాకు 2 కిలోలు అవసరమౌతాయి)





**దిగుబడి :**

ఎకరాకు 200 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుంది.

**పంట కాలం :**

140–145 రోజులు.

ఇన్నోవేటర్ : బల్వాన్ సింగ్, హర్యానా. ఫోన్ : 9992696963

విత్తనాలు కావలసిన వారు పల్లెసృజనను సంప్రదించి పొందవచ్చు. ఫోన్ : 04027111959, సెల్ : 8125799904.

# వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం



**సమస్య – పరిష్కారం :**

వాణిజ్య పంటలలో వేరుశనగది ప్రథమ స్థానమనే చెప్పుకోవచ్చు. దీన్ని ప్రధాన పంటగాను, కందితో మిశ్రమ పంటగాను రైతులు సాగు చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ పంట సాగుకు పడే కష్టానికి దాదాపు రెట్టింపు కష్టం పంట కోతకు పడుతుంది. దీనికి ప్రధాన కారణం కూలీలు లభించకపోవడం, ఒకవేళ లభించినా అధిక మొత్తంలో చెల్లింపులు. పర్యవసానంగా ఈ పంట సాగులో పెట్టిన ఖర్చులకి తగ్గ ఫలితం రావటం లేదు. దీనికి పరిష్కారంగా వేరుశనగ కాయలనును భూమినుండి తీయటానికి గుజరాత్‌కు చెందిన "సంజయ్ కుమార్ డి. టిల్వా" అనే రైతు ఒక పరికరం తయారు చేశాడు.



**పరికరం :**

ట్రాక్టర్‌తో అనుసంధానం చేసుకుని పని చేసే ఈ పరికరం 540 లేదా 1000 ఆర్‌పిఎం వేగానికి అనువుగా తయారు చేయబడింది. ఈ పరికరం వేరుశనగ చెట్లను భూమినుండి త్రవ్వి తీస్తుంది. తీసిన మొక్కలు ఒక కన్వేయర్ బెల్టు ద్వారా వెళ్తూ ఆ కన్వేయర్ బెల్టులోని కుదుపులకు వేరుశనగ కాయలకు అంటుకుని వున్న మట్టి పూర్తిగా రాలిపోతుంది. ఈ శుభ్రమైన కాయలు చెట్టుతో సహా త్రెషర్‌లో వేసి కాయలను చెట్టునుండి వేరు చేయాల్సి వుంటుంది. దీనివల్ల వేరుశనగ కాయలు మట్టిలేకుండా నాణ్యంగా వుండటం వల్ల మార్కెట్‌లో మంచి ధర లభిస్తుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం ఉపయోగించటానికి గంటకు ఒక లీటరు డీజిల్ ఖర్చవుతుంది.

❀ 35 హార్స్‌పవర్‌ల శక్తిగల ట్రాక్టర్‌తో దీన్ని అనుసంధానం చేసుకోవచ్చు.

❀ ఈ పరికరం 510 కిలోల బరువుంటుంది.

❀ పంట నూర్పిడి 98 శాతం జరుగుతుంది.

❀ పరికరం 1250 మి.మీ. వెడల్పు ఉంటుంది.

❀ 100–120 మి.మీ. లోతుకు త్రవ్వి వేరుశనగ మొక్కలను పీకుతుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఇటువంటి ఇతర పరికరాలతో పోలిస్తే ఇది వేరుశనగ పంటను త్రవ్వి తీయటమే కాకుండా కాయలను శుభ్రం చేసి పెడుతుంది.

❀ ఇతర పరికరాలకన్నా కాయలు దెబ్బ తినకుండా చాలా సమర్థవంతంగా పని చేస్తుంది.

❀ ఈ సాధనంతో గంటకు ఒకటిన్నర ఎకరాల్లో వేరుశనగను పీకి కాయలు వేరు చేస్తుంది.

❀ ఇది అన్ని రకాల భూముల్లో పని చేస్తుంది.

**పురస్కారాలు :**

❀ ఇన్నోవేటర్ సంజయ్ కుమార్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు 7వ జాతీయ ఇన్నోవేషన్ పోటీలలో బహుమానమే కాక, 2013లో ఉత్తమ సాంకేతిక జ్ఞాన పురస్కారం కూడా లభించింది.

❀ 2004 లోనే పేటెంటుకు నమోదు చేయటం జరిగింది.

Innovator : **Sanjay Kumar D. Tilwa**
Dist. Rajkot, Gujarat. Ph. : 09879011208


## 'పల్లెసృజన' పత్రికను ఇతరులూ చదివేలా చేయండి

ఇటీవల ఓ వ్యక్తి ఒక తాను అమలు చేస్తున్న వినూత్న పద్ధతిని మాతో పంచుకున్నాడు. తాను 'పల్లెసృజన' పత్రికను పూర్తిగా చదివిన తర్వాత ఒక 'మంగలి షాపు'లో వుంచుతానని, అక్కడైతే వెంట్రుకలు కత్తిరించుకోవటానికి వచ్చి వేచి చూస్తున్న వారు చదివే అవకాశాలు ఎక్కువ అని తెలియజేశారు. మీరు కూడా మీ పత్రికను మీరు చదివిన తర్వాత ఇతరులూ చదివే అవకాశం కల్పిస్తే, మరింత మంది పల్లెజ్ఞానంతో సంధానించ బడతారు. కొత్త కొత్త ఇన్నోవేషన్లు వారు మనతో పంచుకునే అవకాశముంటుంది.

అలాగే ప్రస్తుత సమాజంలో ఎన్నెన్నో కొత్త కొత్త సాంప్రదాయాలు చోటు చేసుకుంటున్నాయి. చాలామంది పుట్టినరోజు వేడుకలు, పెళ్ళిరోజు వేడుకలు, శుభ కార్యాలు, పదవీ విరమణ వేడుకలు లాంటివాటిలో 'బహుమతులు' ఇవ్వటం ఆనవాయితీగా, ఓ సాంప్రదాయంగా మారింది. ఈ బహుమతి ఓ వస్తు రూపంగానో, డబ్బు రూపంగా కాకుండా 'జ్ఞానాన్ని పంచేది'గా వుంటే? దాన్ని పుచ్చుకున్న వ్యక్తి ఆ జ్ఞానాన్ని మరో పదిమందికి పంచుతూ మీరిచ్చిన బహుమతిని గురించి ఆనందంగా చెప్పుకుంటాడు కదా! అదీ శాశ్వతా ఆనందాన్నిచ్చే బహుమతి.

ఇలాంటి వేడుకలకు ఇప్పటినుంచి బహుమతిగా 'పల్లెసృజన' చందా మీరు కట్టి వారికి బహుమతిగా ఇవ్వండి పత్రిక వాళ్ళను చేరుకున్నపుడల్లా మీరే జ్ఞాపకానికి వస్తారు. మీ బహుమతి ఒక్కరోజు కాదు, కొన్ని సంవత్సరాల పాటు గుర్తుంటుంది. – ఎడిటర్

**చందా వివరాల కోసం ఈ పత్రిక వెనక కవర్‌పేజి చూడండి.**



# డా. ఎపిజె అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు 2019

> "నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
> సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
> ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
> జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2019'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2019.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
**www.nif.org.in/ignite**

**National Innovation Foundation-India**
Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,
Gandhinagar - 382650, Gujarat, India.
Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803
E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite

dst.gov.in | honeybee.org | gian.org | sristi.org | cbse.nic.in

# ఇంకొల్లుకు ఆపద్బాంధవుడిగా మారిన మెకానిక్

# బుడేసాబ్



- జమ్మలమడక శశిమోహన్

కొన్ని దశాబ్దాల క్రితం యాంత్రీకరణ జరగని రోజుల్లో రైతులు సాంప్రదాయ పద్ధతిలో ఏ యంత్రాల సహాయమూ లేకుండా కాడెద్దులు కట్టి ముఖ్యంగా ఊళ్ళో వున్న వడ్రంగి, కమ్మరి తదితరుల సహాయంతో వ్యవసాయం చేసేవారు. చేతికింద చాలామంది పనివాళ్లు వుండేవారు. అది కాక పిలిస్తే పలకడానికి ఇంకా ఎంతోమంది సహాయకులు ఉండేవారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు రైతు ఒంటరివాడైపోయాడు. పిలిస్తే పలికేవారు లేరు. పైసలిస్తామన్నా పని చేయడానికి ఎవరూ రావటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి చిన్న వ్యవసాయ పనికి రైతు యంత్రాలపైనే ఆధారపడవలసి వచ్చింది. దానికి తగ్గట్టుగానే వివిధ కంపెనీలు, ఇతర సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు వ్యవసాయంలో రైతుకు సహాయకారిగా వుండే అనేక యంత్రాలను రూపొందించి, అందించారు. రైతుదాకా వచ్చిన ఇటువంటి పరికరాలు, యంత్రాలు అతని అవసరానికి తగ్గట్టుగా మలచడానికి, చెడిపోతే మరమ్మత్తులు చేసి, సహాయం చేయడానికి ఆపద్బాంధవుడిగా దేవుడు పంపినట్టు ప్రతి ఊర్లో మెకానిక్‌లు వెలిశారు. మెకానిక్‌లు లేని ఊరు ఉండదేమో! వీరు చాలా సందర్భాల్లో ఏమీ చదువుకోకపోయినా యంత్రాల భాష మాత్రం పూర్తిగా ఆకళింపు చేసుకున్నవారు. వీరు కేవలం సమస్య చెబితే చాలు దాని పరిష్కారానికి కొత్త యంత్రం రూపంలోకాని, ఉన్న యంత్రానికి మార్పు చేర్పులు చేయటం కాని ఊహించి మనసులోనే డిజైన్ చేసుకొని రైతుకు సహాయకారిగా వుండే విధంగా రూపాంతరం చేసి ఇవ్వగల సమర్థులు. వీరు ఎటువంటి యంత్రాన్నయినా రిపేరు చేయటం, మార్పులు చేయటం, కూర్పులు, చేర్పులు చేయటం చాలా సునాయాసంగా చేయగలుగుతున్నారు. అంటే ఇక్కడ అతనే ఇంజనీర్, అతనే రూపకల్పన చేసేవాడు, అతనే తయారు చేసేవాడు. వీరు రైతులకు వ్యవసాయ ఖర్చులను తగ్గించటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారనే చెప్పవచ్చు.

అటువంటి ఒక ఆపద్బాంధవుడి రూపంలో రైతుకు లభించినవాడే ప్రకాశం జిల్లాలో చీరాలకు 15 కి.మీ. దూరంలో వున్న ఇంకొల్లు గ్రామానికి చెందిన అక్బర్ సాహెబ్, రహమద్ బీల రెండవ సంతానమైన 50 సంవత్సరాల బుడేసాబ్. వీరు నలుగురు అన్నదమ్ములు, ఒక అక్కయ్య. తమ్ముళ్లిద్దరూ వేరువేరు మెకానిక్ షాపులు ఏర్పాటు చేసుకుని



చైనావారి 'ఏరేటర్' పరికరాలు

నడుపుకుంటూ వుండగా, అన్నయ్యతో కలిసి బుడేసాబ్ ఈ మెకానిక్ షాపును నడుపుకుంటున్నారు. వీరిది ఈ మెకానిక్ వృత్తినే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కుటుంబం. వీరికి పూర్వీకుల ఆస్తి 2 ఎకరాల పొలం వుంది. 23 సంవత్సరాల క్రితం బుడేసాబ్‌కి 'దిల్‌షాద్' తో పెళ్ళి ముగ్గురు ఆడ సంతానాన్ని కన్నారు. ముగ్గురినీ ఇంటర్ దాకా చదివించి వారికి పెళ్ళిళ్ళు చేసేశాడు. ముగ్గురు అళ్ళుల్లు కూడా మెకానిక్ వృత్తిలోనే జీవిస్తున్నారు! వీరి తండ్రి కార్పెంటర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు.

బుడేసాబ్ 10 ఏళ్ల వయస్సులో ఆ ఊర్లో వున్న ఒకే మేస్త్రీ నాగేశ్వర రావు దగ్గర 20 సంవత్సరాలు పని చేసి పనిలోని మెళకువలన్నీ నేర్చుకున్నారు. ఆ తర్వాత ఒక ఆత్మీయుడి సహకారంతో బ్యాంకులో ఋణం తీసుకుని 25 సంవత్సరాల నుండి ఒక వర్క్‌షాప్‌ను తామే స్వంతంగా ఏర్పాటు చేసుకుని నడుపుకుంటున్నారు. ఇంకొల్లులో 'బుడేమేస్త్రీ ఫౌండ్రీ' అంటే గుర్తు పట్టనివారు లేరంటే అతిశయోక్తి కాదేమో. ఇందుకు కారణం అతని సృజనాత్మకత, ఎటువంటి పనైనా సరే బుడేసాబ్‌తో అవుతుంది అన్న ఆ ప్రాంత ప్రజల నమ్మకమే ఇతన్ని ఈ స్థాయికి తీసుకెళ్ళింది. వీరి ప్రధాన వ్యాపకం వ్యవసాయ పనిముట్లు తయారీ, వాటికి మరమ్మత్తులు, మార్పులు చేయటం.

బుడేసాబ్ ఎక్కువగా రొయ్యల చెరువులకు సంబంధించిన పరికరాలు తయారు చేస్తూ వుంటాడు. వీటితో పాటు ఆ ప్రాంతంలో ఎంత పెద్ద సమస్యనైనా సరే ఇతనికి వివరిస్తే దానికి తగిన పరికరం తయారు చేయగల సృజనాత్మక శక్తి బుడేసాబ్‌ది. ఇంకొల్లు ప్రాంతంలో ఏదైనా ఒక కొత్తది, పెద్ద పని చెయ్యాలంటే ఇతనే చెయ్యాలి. ఊర్లోని మిగతా మెకానిక్‌లలో చాలామంది బుడేసాబ్ వద్ద శిష్యరికం చేసిన వారే. ఈ ఊళ్ళో కేవలం మెకానిక్ షాప్‌లు గల ఒక వీధి వుంది.

రొయ్యల చెరువుల్లో వాటికి సరియైన ఆక్సిజన్ అందటం కోసం 'ఏరేటర్లు' అనే చిన్నపాటి ఫ్యాన్లు తిరిగే యంత్రాలను చెరువుల్లో ఏర్పాటు చేస్తారు. చైనా నుండి దిగుమతి అయిన వాటిని ఆ చెరువుల్లో వదులుతారు. ఇవి కరెంటు సహాయంతో తిరుగుతూ వుండటంతో వాటికి ఏర్పాటు చేసిన ఫాన్లు తిరుగుతూ వుంటే దానివల్ల ఆ నీటిలో ఏర్పడే బుడగల ద్వారా రొయ్యలకు అవసరమైన గాలి అందటంతో పాటు, నీటిని కూడా తిప్పటంతో రొయ్యలు పారే నీటికి ఎదురీదే సహజ గుణం వల్ల ఈ చెరువుల్లో తిరుగుతున్న నీటికి ఎదురీదుతూ ఆరోగ్యంగా పెరుగుతుంటాయి. ఈ సమస్యకు తనదైన శైలిలో ఒక పరిష్కారం కనుగొన్నాడు బుడేసాబ్. పాత అంబాసిడర్ కారు వెనుక చక్రాల 'హౌజింగ్'ను (రియర్ ఆక్సిల్) తీసుకు వచ్చి దాన్ని మోటార్‌తో అనుసంధానం చేశాడు. చేపల చెరువుల మధ్యనున్న గట్టుపై దీన్ని ఏర్పాటు చేసి దానికి రెండువైపులా చెరువుల్లో ఈ ఏరేటర్లు ఒకే మోటారుతో తిరిగేలా ఏర్పాటు చేశాడు. చైనా ఏరేటర్లలో ఒక మోటర్ సహాయంతో నాలుగు ఫ్యాన్లు మాత్రమే తిరుగుతాయి. ఇతను తయారు చేసిన పద్ధతిలో ఒకవైపు పది, మరోవైపు పది ఇరవై ఫ్యాన్లు 3 హార్స్‌పవర్‌ల మోటార్ సహాయంతో తిరుగుతాయి. దీంతో గతంలో 4 లక్షల రొయ్యలు పెరిగే చెరువుల్లో ఇప్పుడు 8 లక్షల దాకా పెంచుకుంటున్నారు రైతులు. బుడేసాబ్ చేసిన చిన్న పరికరంతో చేపల దిగుబడి



ఇన్నోవేటరర్ బుడేసాబ్‌తో వాలంటీర్ ఏడుకొండలు

తక్కువ ఖర్చుతో రెట్టింపు అయింది. గతంలో ఎకరం చెరువుల్లో 3 నుండి 4 టన్నుల రొయ్యల దిగుబడి చేసుకునే రైతులు ఇప్పుడు 10 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. గత ఇరవై సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో ఈ ఏరేటర్లను తయారు చేస్తూనే వున్నాడు. వీటికి నిర్వహణా ఖర్చు కూడా చాలా తక్కువ.

ఆ ప్రాంతంలోని రైతులు కొందరు 'కృసేడర్' అనే చేతితో నడిపే వీడర్‌ను తీసుకుని కొంతకాలం వ్యవసాయం చేసుకున్నారు. వీటిని మనిషి నడుస్తూ పని చేయించాల్సి వుంటుంది. రాను రాను వాటిని నడిపేందుకు ఇబ్బంది పడటం వల్ల రైతులు వాటిని మూలన పడేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను బుడేసాబ్‌కు వివరించగా దాన్ని తన వర్క్‌షాప్‌కు తెప్పించి అందులోని ఇంజన్‌ను తీసుకుని తన పరిజ్ఞానంతో మనిషి కూర్చుని నడిపేలా నాలుగు టైర్లతో ఒక చిన్న ట్రాక్టరును తయారు చేశాడు. ఇది విజయవంతం కావటంతో ఆ ప్రాంత రైతులంతా తమ చేతితో నడిపే వీడర్లను తీసుకు వచ్చి ఇతనితో ట్రాక్టరు తయారు చేయించుకుని వెళ్తున్నారు. ఆ


కృసేడర్ ఇంజన్‌తో తయారైన చిన్న ట్రాక్టర్


ట్రాక్టర్‌కు అమర్చిన 6 కొయ్యల గొర్రు

ప్రాంత రైతులే కాక, పక్క రాష్ట్రమైన కర్నాటక నుంచి కూడా రైతులు ఇతని వద్దకు వచ్చి తమ పాత వీడర్ ఇంజన్‌తో ట్రాక్టర్ తయారు చేయించుకుని వెళ్తున్నారు. ఈ ట్రాక్టరు వెడల్పు 33 అంగుళాలుంటుది. 14 హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల ఈ చిన్న ట్రాక్టరు దాదాపు రైతుకు అవసరమైన అన్ని పనులను చేసి పెడుతుంది. కూర్చుని నడిపేది కావటం వల్ల రైతులు కూడా ఎటువంటి అలుపు లేకుండా తమ పనులు చేసుకుంటున్నారు. వెడల్పు ఎక్కువై అంతర సేద్యాలకు అవసరమనుకుంటే ఈ ట్రాక్టరు టైర్లను తిరగేసి బిగిస్తే చాలు ట్రాక్టరు వెడల్పు 27 –28 అంగుళాలకు మారిపోతుంది. ప్రత్తి, మిరప లాంటి పంటలలో అంతర సేద్యాలు కూడా సునాయాసంగా చేసుకోవచ్చు. రైతులు ఇంజన్ తీసుకుని వస్తే ఇతను 55 వేలు తీసుకుని ట్రాక్టరు తయారు చేసి ఇస్తున్నాడు. కృసేడర్ వీడర్ కొత్తది కొనాలన్నా ఇప్పుడు సబ్సిడీలో 70 వేలకు లభిస్తోంది అంటాడితను. అంటే కొత్తది తీసుకున్నా, లక్షా 30 వేలలో సరికొత్త చిన్న ట్రాక్టరు తయారు చేయించుకోవచ్చన్నమాట. గంటకు ఒక లీటర్ డీజిల్ ఖర్చవుతుంది గంటకు ఒక ఎకరా పొలాన్ని సునాయాసంగా దున్నుకోవచ్చు. ఇందులో మూడు గేర్లు ముందుకు నడిపేవి, ఒకటి వెనక్కు నడిపే రివర్స్ గేరు సౌకర్యంతో పాటు హైడ్రాలిక్ సౌకర్యం కూడా ఉంది. బుడేసాబ్ ఇంతవరకు 20కి పైగా ఇలాంటి ట్రాక్టర్లను తయారు చేసి రైతాంగానికి అందించాడు. అన్ని ట్రాక్టర్లూ ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా వారికి సేవలు అందిస్తూనే వున్నాయి.

ఈ ప్రాంతంలో కొందరు రైతులు వారి సామర్థ్యానికి తగ్గట్టుగా చిన్నవి, పెద్ద ట్రాక్టర్లను కూడా కలిగి వున్నారు. వాటితో అంతర సేద్యాలకు పనికి వచ్చేట్టుగా ఏదైనా ఉపాయం ఆలోచించమని కోరటంతో, ట్రాక్టర్ల ఎత్తును క్రిందనుంచి 3

అడుగులు పైకి పెంచాడు. వీటిలో 'ఫోర్‌వీల్ డ్రైవింగ్ ట్రాక్టర్లు' కూడా ఉన్నాయి. వాటితో కూడా రైతాంగం మూడు అడుగుల ఎత్తున్న పైర్లలో కూడా అంతర సేద్యాలు, పురుగు మందులు పిచికారి చేసుకోవటం లాంటి పనులు చేసుకుంటున్నారు. దీన్ని ఎత్తు అవసరం లేదు అనుకుంటే ఎటువంటి ఇబ్బంది లేకుండా మామూలు ఎత్తుకు మార్చుకోవచ్చు.

బుడేసాబ్ కొన్ని ట్రాక్టర్లకు ఒకే వ్యక్తి (కేవలం డ్రైవర్) ట్యాంకులోకి నీరు నింపుకుని, తానొక్కడే పొలానికంతా పురుగు మందును పిచికారి చేసే ఏర్పాటు కూడా చేసి ఇచ్చాడు. ఇతను ఒక ప్రత్యేకమైన ఫుట్‌వాల్వ్ సహాయంతో కంప్రెషర్ ద్వారా ట్యాంకులో నీరు అయిపోయిన వెంటనే నీటి కొలను వద్దకెళ్ళి తానే నీరు నింపుకుని, పొలానికి మందు పిచికారి చేసుకుంటాడు డ్రైవర్.

ఇంకొల్లు గ్రామ ప్రాంతంలో సముద్రం నుండి ఒక వాగులోకి నీరు వెనక్కి వస్తూ వుంటుంది ఈ నీరు సముద్రం పోటుమీద వున్నపుడు ఇంకా ఎక్కువగా కూడా వుంటుంది. ఆ వాగు దాదాపు 150 అడుగుల వెడల్పు వుంటుంది. ఒక రొయ్యల చెరువుల యజమాని ఆ వాగు అవతల వున్న తన చెరువులకు వెళ్ళాలంటే ఎంతో చుట్టూ తిరిగి పోవాల్సి వచ్చేది. ఈ సమస్య పరిష్కారానికి ఎంతమంది ఇంజనీర్లను కలిసినా ఈ వాగు లోపల బురద ఎక్కువగా వుంటుంది. దీనిపై వంతెన నిర్మాణం చెయ్యాలంటే ప్రభుత్వం వల్ల అవుతుంది కానీ ఒక రైతు భరించేంత స్వల్ప ఖర్చుతో తయారయ్యేది కాదీ నిర్మాణం అని ఇంజనీర్లే చేతులెత్తేశారు. తన మిత్రుడు బుడేసాబ్ సామర్థ్యం తెలుసు కనుక ఆ రైతు ఇతనికి సమస్య వివరించగా దాన్ని గురించి ఆలోచించి, ఒక పరిష్కారం మదిలోనే రూపుదిద్దుకొని 5 లక్షల రూపాయలివ్వు నేను తయారు చేసి పెడతాను అన్నాడు. ఇతని మనోధైర్యానికి ముచ్చటేసి ఆ రైతు



బుడేసాబ్ చేసిన మొక్కజొన్న నూర్పిడి యంత్రం



స్వంతంగా తయారు చేసుకున్న హైడ్రాలిక్ ప్రెస్సింగ్ పరికరం

బుడేసాబ్ అడిగిన మొత్తం ఇవ్వగా ఆ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ఇనుప సామాగ్రిని తన వర్క్‌షాప్‌లోనే ఒక వారం రోజులు తయారు చేసుకుని బ్రిడ్జిని నిర్మించాల్సిన ప్రాంతానికి తరలించాడు. రెండు తెప్పలు, 10 మంది మనుషుల సహాయంతో కేవలం నాలుగు రోజుల్లో బ్రిడ్జిని నిర్మించేశాడు. ఆ బ్రిడ్జిపై మోటార్ సైకిళ్లు, మనుషులు వెళ్ళేలా ఏర్పాటు చేశాడు. ఆ బ్రిడ్జిపైన ఆటోలు కూడా వెళ్ళగలవు కానీ, ఆటోలు వెళ్ళే ఏర్పాటు చేస్తే బ్రిడ్జి త్వరగా పాడైపోతుందని ఆటోలు అవతలకి దాటడానికి వీలు లేకుండా మధ్యలో ఒక అడ్డంకిని ఏర్పాటు చేశాడు అలా చేయటం వల్ల మోటార్ సైకిళ్ళు, పశువులు, మనుషులు వెళ్తాయి కానీ ఆటోలు వెళ్ళలేవు. ఈ బ్రిడ్జి దాదాపు 7 సంవత్సరాలు పని చేసింది. ఆ తర్వాత దాన్ని ఏర్పాటు చేయించిన యజమానికి అవతలి వైపున్న చెరువుల కౌలు అయిపోవటంతో దాన్ని ఇటీవలే తీసివేశాడు. ఇప్పుడు మరో బ్రిడ్జి నిర్మాణాన్ని ఆటోలు కూడా వెళ్ళగలిగే సామర్థ్యంతో ఏర్పాటు చేసే పనిలో వున్నాడు.

వీటితో పాటు శీతల గిడ్డంగుల్లో ధాన్యం మూటలు ఎత్తేందుకు కూలీలు లభించని పరిస్థితుల్లో 20 మంది హమాలీలు చేసే పనిని కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు

మూటలను సునాయాసంగా గిడ్డంగుల్లో ధాన్యం సంచులను పేర్చి పెట్టటానికి అనువుగా ఒక కన్వేయర్‌తో పనిచేసే లిఫ్ట్‌ను ఏర్పాటు చేశాడు.

ఆ ప్రాంతంలో లభించే (చిన గంజాం) ఇసుకను వివిధ రకాల సైజుల్లో వేరు చేసేందుకు జల్లెడ పట్టేందుకు కూలీలు లభించక ఇబ్బంది పడుతుంటారు. ఒకవేళ లభించినా చాలా ఖర్చుతో కూడుకున్న పని. అలా ఇసుకను సన్నటి ఇసుక, కాస్త దొడ్డు ఇసుక, ఇంకా దొడ్డు ఇసుక ఇలా ఒకేసారి మూడు రకాలుగా మార్చేందుకు భారీ యంత్రాల ఏర్పాటును కేవలం తన సృజనాత్మకతతో తక్కువ ఖర్చులో చిన్న సైజులో ఒక యంత్రాన్ని ఏర్పాటు చేశాడు.

మినప గుండ్లు తీసే పరికరం, మొక్కజొన్న నూర్పిడి యంత్రం, వృథాగా పడివున్న ఆటో ఇంజన్లను పంపుసెట్లుగా మార్చటం... ఇలా చెప్పుకుంటూ పోతే బుడేసాబ్ చేసిన ఎన్నో రకాల ఇన్నోవేషన్లు ఆ ప్రాంత ప్రజలకు, రైతాంగానికి ఇప్పటికే కొన్ని కోట్ల రూపాయల ఖర్చు మిగిల్చేలా చేశాడని చెప్పవచ్చు.

ప్రస్తుతం తాను తనవద్దకు వచ్చే రైతుకు అవసరమైన పనిముట్లను వారు ఇచ్చే కొంత బయానాతో అవసరమైన సామాగ్రి తీసుకు వచ్చి తయారు చేసి ఇవ్వటం వల్ల కొంత ఎక్కువ ఖరీదు నేను చెల్లించాల్సి వస్తుంది, రైతుకు కూడా కొద్దిగా ఎక్కువగానే ఖర్చవుతుంది. ప్రభుత్వం లేదా ఎవరైనా సహృదయులు ఆర్థిక సహకారం అందిస్తే నేను చేసే పనులకు అవసరమైన సామాగ్రిని ఎక్కువగా ఒకేసారి తెచ్చి పెట్టుకుని అవసరమైన ముడి వస్తువులు తయారు చేస్తే తనకు కొనుగోలు కరీదు తగ్గుతుంది, చేసే వస్తువులు కూడా ఒకే తరహాలో వుండి రైతుకు కూడా ఇంకా తక్కువ ధరకే అందించే అవకాశముంటుందని అంటున్నాడు బుడేసాహెబ్.

ఇతని సృజనాత్మకమైన ఆలోచనలను ఆ ప్రాంత



ఇసుక సైజులు వేరు చేసేందుకు మనుషులు చేసే పని



ఇసుక సైజులు వేరు చేసేందుకు బుడేసాబ్ చేసిన యంత్రం

రైతులే కాక యావత్ రైతాంగం వినియోగించుకుని తమ వ్యవసాయ ఖర్చులను వీలైనంత తగ్గించుకుంటారని ఆశిస్తోంది పల్లెసృజన.

విజయవాడ పల్లెసృజన ఇంఛార్జి ఏడుకొండలు ఇంకొల్లుకు వెళ్ళి బుడేసాబ్‌ను కలిసి అతని వివరాలు సేకరించినపుడు ఇతను పెద్ద పేరొందిన ఇంజనీర్లకన్నా గొప్పవాడు అన్న భావన కలిగింది 'పల్లెసృజన'కు. ఏమీ చదువుకోకుండా, ఇంతమంది రైతుల సమస్యలకి తానొక్కడే పరిష్కార మార్గాలు చూపిస్తున్న బుడేసాబ్ జ్ఞానము, అనుభవము గుర్తింపు లేకుండా పోకూడదని భావించి, ఇప్పుడు కళాశాలల్లో తయారౌతున్న ఇంజనీర్లు తమకున్న పుస్తక జ్ఞానం పెంపొందించటం కోసం బుడేసాబ్ లాంటి క్రియాశీల ఇంజనీర్ వద్ద కొంతకాలం శిక్షణ పొందితే, వాళ్ళ చదువుకి సార్థకత ఏర్పడుతుందని, ఇంకా మంచి ఇంజనీర్లుగా రూపు దిద్దుకుంటారని భావిస్తోంది 'పల్లెసృజన'. ఇలాంటి ఇంకా ఎంతోమంది బుడేసాబ్‌లు రైతుల కష్టాలను తొలగించటంలో చేస్తున్న కృషి గణనీయమైనది, రైతుల ఖర్చులు తగ్గించి, ఆదాయం పెంచటంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న ఇటువంటి గ్రామీణ మెకానిక్‌లను గుర్తించి వారికి ప్రాచుర్యం కల్పించి, తగు రీతిన సత్కరించడం సమాజం బాధ్యతగా భావిస్తోంది 'పల్లెసృజన'. ఈదిశలో కావలసిన సహాయ సహకారాలు అందించటానికి 'పల్లెసృజన' సిద్ధంగా వుంది.

బుడేసాబ్ ఫోన్ నెం. 9440931441. ఇతని సేవలు పొందాలనుకునేవారు 'పల్లెసృజన' ద్వారా కూడా సంప్రదించవచ్చు. ఫోన్ నెం. 81257 99904 (రాఘవ రెడ్డి)

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040-27111959**) సంప్రదించండి.



# ఆయుర్వేద జ్ఞాన మథనం

# గుండెనొప్పి నివారణకు 17 సూత్రాలు

## చికిత్సకన్నా నివారణ ఉత్తమం



పలివెల ఉమా మహేశ్వర రావు, ఆయుర్వేద వైద్యులు, మణుగూరు, ఖమ్మం జిల్లా. ఫోన్ : 94402 86854 :

మనం ప్రతిరోజూ పేపర్లలోను, మన చుట్టుప్రక్కల చూస్తూనే వున్నాం 'చిన్న వయసులోనే గుండె నొప్పి వచ్చిందని' చనిపోయిన వారిని గురించి మాట్లాడుకుంటుంటే వింటూనే వుంటాం. దీన్ని బట్టి ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో 'గుండెనొప్పి' కూడా ప్రముఖ పాత్రను పోషిస్తోంది. గుండెనొప్పి వచ్చిన తర్వాత లక్షలు ఖర్చుపెట్టి చికిత్స చేయించుకోవటం కన్నా అది రాకుండా నివారించు కోవటం ఎంతో మిన్న. ఖర్చు తగ్గుతుంది, ఆరోగ్యం కూడా బాగా వుంటుంది. అందుకే మన ఆయుర్వేద వైద్యులు ఉమా మహేశ్వర రావు గుండెనొప్పి రాకుండా ఉండేందుకు పాటించ వలసిన "17 సూత్రాలను" వివరంగా తెలియజేస్తున్నారు. ఈ సూత్రాలు తాను కనిపెట్టినవి కాదని, పూర్వం చరకుడు, అగస్త్యుడు లాంటి ఎందరో ఋష్యపుంగవులు తమ గ్రంథాలలో నిక్షిప్తం చేసిన వాటినుంచే సేకరించారట. వాటిని గురించి తెలుసుకుందాం.....

1. **ప్రధానంగా నిద్ర** - ప్రతి మనిషి రోజులో కనీసం 6 నుంచి 7 గంటల పాటు నిద్రిస్తే గండెనొప్పి వచ్చే అవకాశాలు చాలా తక్కువ. నిద్ర పట్టడం లేదు అనుకునే వారు ఎక్కడైనా విరివిగా లభించే 'గోరింటాకు'ను రెండు లేదా మూడు పిడికిళ్ళు తీసుకుని ఒక మూటలో కట్టుకుని తలగడక్రింద పెట్టుకుని పడుకుంటే బాగా నిద్ర పడుతుంది. దీన్ని ఒక వారం రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు.
2. **వ్యాయామం** - వ్యాయామం అంటే ఏదో వ్యాయామశాల (జిమ్)కు వెళ్ళి చేయాలి అనుకోకండి, రోజుకు నాలుగైదు గుంజిళ్ళు తీయటం, నేలపై చెప్పులు లేకుండా నిలుచుని 2– 3 సార్లు ముందుకు వంగి లేవాలి. తర్వాత వంగుని ఎడమ చేతితో కుడిపాదం వేళ్ళను, కుడి చేతితో ఎడమ పాదం వేళ్ళను తాకేలా 4–5సార్లు చేస్తే చాలు. ఇలా చేస్తే శరీరంలోని దాదాపు అన్ని భాగాలు కదలిక జరిగి శరీరానికి మంచి వ్యాయామం అవుతుంది.
3. **భోజనం** - హడావిడిగా తిన్నామా, చెయ్యి కడుక్కున్నామా పనిమీద వెళ్ళామా అన్నట్లు కాకుండా తిన్న రెండు నిమిషాల్లో ఎంత తిన్నా కూర్చుని, బాగా నమిలి తినాలి. అలా నమిలి తినటం వల్ల శరీరంలో మనం తీసుకున్న ఆహారాన్ని ఎక్కువ శ్రమ లేకుండా శరీరానికి అందేలా చేస్తుంది రక్తం. క్రొవ్వు పదార్థాలు పేరుకుపోవడం కూడా తగ్గుతుంది.
4. **ప్రణాళికాబద్ధంగా పని చేయటం** - మనం ఒక పనిమీద వెళ్లాలనుకుని వెంటనే మనసు మార్చుకుని ఈ పని వత్తిడి మీద వున్నా సరే మరో పని చేయాల్సిన అవసరం వచ్చి ఆ పనిమీద వెళ్తుంటాం. అప్పుడు మొదట అనుకున్న పని వత్తిడి మనసును కుదిపేస్తూ వుంటుంది. ఈ పద్ధతి వల్ల మెదడుపై వత్తిడి పెరుగుతుంది. ఈ పరిస్థితి రాకుండా చేయాలనుకున్న పనిని ప్రణాళికాబద్ధంగా, నింపాదిగా ఒక పని తర్వాత మరో పని చేసుకుంటూ వెళ్ళాలి. అలా చేస్తే గుండెపై వత్తిడి ఉండదు. నిర్ణయాలు త్వరత్వరగా మార్చుకోకూడదు. **దినచర్య వ్రాసుకోవటం** - కొందరు వ్యక్తులు తమ దినచర్యను డైరీలో లేదా కాగితాలపై వ్రాసుకుంటూ వుంటారు. ఇలా చేయటం వల్ల ఆరోజు వత్తిడిని పూర్తిగా మనసులోనుండి తీసి పేపర్లో పెట్టినట్లే అని గుర్తించండి. ఎందుకంటే మనసులో ఏవిధమైన బాధ వుందో దాన్నే కాగితంపైన పెట్టడం వలన 90శాతానికి పైగా వత్తిడి తగ్గిపోతుంది.
5. **పానీయాలు సేవించడం** - మన శరీరానికి టీ, కాఫీ, శీతల పానీయాలు కొంత వరకు ఉత్తేజాన్ని ఇస్తాయి కానీ వాటిని సేవించడంలో కొంత జాగ్రత్త తీసుకుంటే మంచిది. ఒకచోటకు వెళ్ళినప్పుడు కాఫీ, మరో చోటకు వెళ్ళినప్పుడు టీ, ఇంకోచోటకు వెళ్ళినప్పుడు మజ్జిగ లేదా శీతల పానీయాలు ..... ఇలా మార్చి మార్చి తీసుకోకుండా మొదట ఏ పానీయం సేవించామో అదే తీసుకునేలా జాగ్రత్త తీసుకుంటే మంచిది. అంతేకానీ మార్చి మార్చి తీసుకోవటం వల్ల అందులో వున్న ఎంజైమ్‌లను శరీరం

తీసుకోవటంలో కాస్త ఇబ్బంది పడి శరీరానికి కావలసిన హుషారును అందించలేదు సరికదా అనారోగ్యానికి గురి చేసే ప్రమాదముంది. ఎవరింటికైనా వెళ్ళినపుడు ఇప్పుడే కాఫీ త్రాగి వచ్చాను, వీలైతే కాఫీ వుంటే ఇవ్వండి లేకపోయినా ఫర్వాలేదు అని సున్నితంగా తిరస్కరించండి.

6. **విరామం (రిలాక్సేషన్)** - ఒకచోట కూర్చుని పని చేసేటపుడు ఎక్కువ సేపు కూర్చునే పని చేయకుండా ఏదో ఒక పనిమీద అప్పుడప్పుడూ లేస్తూ అలా, ఇలా తిరుగుతూ పని చేసుకుంటూ వెళ్ళాలి అంతేగాని గంటల తరబడి కూర్చుని లేదా గంటల తరబడి నిల్చుని పని చేస్తూ వుండటం వల్ల కూడా గుండెపైన వత్తిడి పడే అవకాశం ఉంటుంది.

7. **సెలవు (విరామం)** - ఆఫీసుల్లో పని చేసేవారు ఆదివారం వస్తే సెలవు కావాలంటారు. మరి శరీరానికి, గుండెకు సెలవు ఎలా ఇవ్వగలం? గుండె సెలవు తీసుకోవటం అంటే ఇక మనం అంటూ లేనట్టే కదా! కానీ గుండెకు కూడా విరామం ఇవ్వవచ్చు ఎలాగంటే సమయం దొరికినప్పుడల్లా సమీపంలోని పచ్చికపైన చెప్పులు లేకుండా నిలబడి కాసేపు కళ్ళు మూసుకుని మీ మనసుకు నచ్చిన పర్వతం, ఆహ్లాదకరమైన వాతావరణం, సెలయేర్లు, జలపాతాలను మనసులో ఊహించుకుంటూ కొద్ది నిమిషాలు గడిపితే చాలు గుండె ఎంతో విరామానికి గురవుతుంది. అంటే మనమున్న ప్రపంచంలో నుండి మరో ప్రపంచంలోకి మానసికంగా వెళ్ళగలగాలి. ముఖ్యంగా సెలవులు అంటూ ఏర్పాటైంది కేవలం మానసిక వత్తిడి తగ్గటానికి అని అందరూ గుర్తిస్తే మంచిది. అంతేగాని సెలవులు వస్తే చాలు హడావిడి పనులతో గుండెను పరిగెత్తించడం మంచిది కాదు. ఆమాటకొస్తే అసలు సెలవులు అనేవి లేకుండా చేస్తే ప్రతి మనిషి తన పని తాను చేసుకుంటూ వుంటాడు కాబట్టి గుండెజబ్బులు కాస్త తగ్గుతాయేమో అనిపిస్తుంది.

8. **వాతావరణ మార్పు** - ఒక చోటనుండి మరో చోటకు వెళ్ళినపుడు అక్కడి వాతావరణ పరిస్థితుల వల్ల మనసు అంటే గుండె కొంచెం విశ్రాంతికి లోనవుతుంది. కాబట్టి వివిధ వాతావరణ పరిస్థితుల్లోకి వెళ్తూ వుండాలి. ఉదా. విహార యాత్రలు. ఆఫీసుల్లో పని చేసేవారు అప్పుడప్పుడూ పార్కుల్లోకి వెళ్ళటం లాంటివి చేస్తూ వుండాలి.

9. **పని వత్తిడిలో హెచ్చు తగ్గులు** - అంటే ఈరోజు వంట్లో శక్తి బాగుందని 14 పనులు చేశాం రేపు నీరసంగా వుందని 6 పనులే చేశాం అనుకోండి ఒకరోజు గుండె వత్తిడికి గురవుతుంది, రెండోరోజు కాస్త విశ్రాంతికి గురవటం లాంటి హెచ్చు తగ్గులు లేకుండా చేయాల్సిన పనులను ఒక ప్రణాళిక ప్రకారం చేసుకుంటూ వెళ్ళాలి. కొందరు మధుమేహం వున్నవారు ఒక పెళ్ళికి వెళ్ళాలి అనుకున్నపుడు అక్కడ కాస్త ఎక్కువగా తినాల్సి వస్తుందని రెండు మాత్రలు వేసుకుని వెళ్తుంటారు. అలా చేయకూడదు. ఈ చర్యలు చక్కెర లెవెల్స్ ఇంకా తగ్గిస్తాయి. **ఒక పని వదిలి మరో పనిపై శ్రద్ధ చూపటం** - నీకొక పని వుంది. దాన్ని మర్చిపోయి, ఇతరుల పనులపై మీరు శ్రద్ధ వహించడం వల్ల ఇతరులకు మంచి చేశామన్న తృప్తితో గుండె కాస్త ఊరటకు గురవుతుంది. తర్వాత వెంటనే నీ పని పెండింగ్‌లో పడిపోయింది కాబట్టి దాన్ని కూడా పూర్తి చేయాలి అనుకున్నపుడు గుండెపైన వత్తిడి పెరుగుతుంది. ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతరుల పని అత్యవసరం అనుకున్నపుడు వారి పని చేసి, మీ పని మరునాటికి లేదా కాస్త విశ్రాంతి తర్వాత చేసుకుని గుండె వత్తిడి తగ్గించుకోండి. **సమయపాలన (టైం మేనేజ్‌మెంట్)** - నీవు చేయాల్సిన ఒక పని వుందనుకో, అదే సమయంలో ఇతరుల పని కూడా అత్యవసరమే అనుకున్నపుడు కాస్త ప్రశాంతంగా ఆలోచించి, ఏది అత్యవసరమైతే దాన్నే ప్రశాంతంగా చేయాలి. అంతే తప్ప, రెండింటినీ అత్యవసరమే అనుకుని, ఏపనీ పూర్తిగా చేయలేక, మానసిక తృప్తి చెందలేక పోవటం వల్ల పనులూ పూర్తి కావు, మీ గుండెపైన వత్తిడీ పెరిగిపోతుంది. **చెయ్యాలనుకున్న పనిని చేసెయ్యటం** - ఈరోజు ఒక పని చేయాలి అనుకుని ఏవో కారణాల వల్ల దాన్ని సరే రేపు చేద్దాం అనుకోవటం వల్ల అప్పటికి కాస్త విశ్రాంతి అనిపించి, కాసేపటికి ఆ పని చేసేసివుంటే బావుండేది కదా అని ఆలోచించటం వల్ల మానసిక వత్తిడి పెరిగి గుండెపైన భారం పడుతుంది.

10. **పరధర్మం** - నీ పనుల విషయం సరే ఇతరుల సమస్యలను తీర్చాలి అనుకోవటం మంచిదే కాని, వాటికోసం నీవు శ్రమ పడితే ఫరవాలేదు కాని, వత్తిడికి గురి కాకుండా చూసుకోవాలి. ఎందుకంటే గీతలో శ్రీకృష్ణుడే అన్నాడు

"పరధర్మం భయంకరమైనది కాని, ఆచరణకు అనుచితమైనది" అని. వారి సమస్య సులభంగా తీర్చేయవచ్చు అనుకుంటాం కానీ జఠిలమైనప్పుడు అది నీ మనసును వత్తిడిగి గురి కాకుండా చూసుకోవాలి..

**11. పనిపట్ల ప్రణాళికను వ్రాత రూపంలో పెట్టుకోవడం -** నీవు ఈరోజు చేయాలనుకున్న పనులను ముందుగా డైరీ లేదా ఒక కాగితంపైన వ్రాసుకోవటం వల్ల ఎంతో మానసిక వత్తిడి తగ్గిపోతుంది. ఆ పని అయిపోయిన వెంటనే దానిపై గుర్తు పెట్టుకున్నప్పుడు 'హమ్మయ్య' అనిపిస్తుంది. మిగిలిన పనిని రేపటికి వాయిదా వేసుకున్నా గుండెపై పెద్దగా వత్తిడి పెరగదు. ఎందుకంటే ఒక ప్రణాళిక ప్రకారం వెళ్తున్నామన్న విశ్రాంతికి వెళ్తుంది హృదయం.

**12. శ్వాసతో విశ్రాంతి -** మనం చేయబోయే పనిని ఒకసారి మననం చేసుకుని రెండుమూడు సార్లు ప్రశాంతంగా గుండెల నిండా ఊపిరి పీల్చుకుని శ్వాస తీసుకుంటూ ఆలోచిస్తే ఎంతో మానసిక వత్తిడి తగ్గుతుంది.

**13. నవ్వు-** భగవంతుడు మానవునికి ఇచ్చిన గొప్ప వరం నవ్వు. స్వగతంగా కొన్ని సంఘటనలను గుర్తు చేసుకుని నవ్వటం ఒకరకంగా మంచిదే అయినా, ఆ నవ్వుని ఇతరుల సమక్షంలో పంచుకోవటం వల్ల గుండె, ఊపిరి తిత్తులకు ఒకరకమైన యోగా చేసినంత మంచి జరుగుతుంది. దీన్నే నగరాల్లో 'లాఫింగ్ థెరపీ' పేరుతో ఎక్కువగా నవ్వేలా చేస్తుంటారు. వత్తిడిని బాగా తగ్గించే గుణం నవ్వులో వుంది.

**14. నిరాశా - నిస్పృహ -** చాలామంది నా వయసు మీరిపోయింది, ఇక నావల్ల ఏమీ కాదు, నేనెవరిపైనైనా ఆధార పడక తప్పదు అనుకోవటం వల్ల చాలా నిస్పృహకు గురౌతుంటారు. ఒక పని నీవల్ల అవుతుందన్న నమ్మకం నీకున్నా సరే, ఇది నావల్ల అవుతుందో లేదో అని ముందే ఊహించుకుని నిరాశకు గురి కావద్దు. ఇలా చేయటం వల్ల మానసిక వత్తిడి ఎక్కువవుతుంది. నీవు ప్రయత్నించు, నీకు చేతనైనంత చేసెయ్. అయితే చేసేద్దాం, కాకపోతే ఆ తర్వాత ఆలోచిద్దాం అనుకునే భావన గుండెను విశ్రాంతికి గురి చేస్తుంది.

**15. వత్తిడిని అప్తులతో పంచుకోవడం -** నీకు విపరీతమైన వత్తిడి వున్నపుడు ఆ వత్తిడిని ఉద్దేశ్య పూర్వకంగా కాకుండా మాటల మధ్యలో వత్తిడి వున్నట్టు తెలియజేసేలా ఇతరులతో మీ వత్తిడిని పంచుకుంటే మీ మనసు కాస్త ఉపశమనం పొందుతుంది. దీన్నే వత్తిడితో వున్న మనసుని డైవర్షన్ చేయటం అని కూడా అనవచ్చు. ఇలాంటప్పుడు ఏదైనా ఒక నూనెను కాస్తంత తీసుకుని అరికాళ్ళు, పొట్ట భాగం, ఇతర కండరాలకు పూసుకుంటూ విశ్రాంతి చేకూర్చితే వత్తిడి బాగా తగ్గిపోతుంది.

**16. నిపుణుల ద్వారా ఉపశమనం -** వారి వారి మనస్తత్వం ప్రకారం కొందరు ఆధ్యాత్మికవేత్తలను కలవటం ద్వారా, కొందరు డాక్టర్లను కలవటం ద్వారా తమ సమస్యలు చెప్పి వత్తిడిని తగ్గించుకుంటూ వుంటారు. ఇది వారి వాం మనస్తత్వాలను బట్టి చేసుకోవటం కొంత వరకు ఫలితాన్ని ఇస్తుంది.

**17. మార్పు -** మన మనస్తత్వాలను ఎదుటి వారి లేదా కుటుంబ సభ్యులు లేదా పిల్లలను బట్టి కొద్ది కొద్దిగా మార్పు చేసుకోవటం వల్ల కాస్త వత్తిడి తగ్గుతుంది. అంతేకాని, నాకు తెలిసిందే వేదం 'నేను మోనార్క్‌ను' అనుకోవటం వల్ల వత్తిడి పెరుగుతుందే కాని, తగ్గదు.

వీటితోపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వత్తిడిని తగ్గించుకుని గుండె జబ్బుల నుంచి దూరంగా వుండవచ్చు. మీరు తీసుకునే ఆహారంలో ఉప్పు, పంచదార కొద్దిగా తగ్గించుకుని, కొద్దిపాటి వ్యాయామాలు అంటే మట్టిపైన చెప్పులు లేకుండా నడవటం, పచ్చటి పచ్చికపైన నడవటం, కాసేపు క్రింద కూర్చుని లేవటం లాంటివి చేయాలి. అలాగే దోసకాయ రసం అర గ్లాసు తీసుకుని అందులో మూడు చెంచాల అల్లం రసం, మూడు చెంచాల అలోవీర గుజ్జు కలిసి ప్రతిరోజూ ఉదయం సేవిస్తూ వుంటే మీ శరీరంలో క్రొవ్వు పదార్థాలు పెరిగే సమస్యే వుండదు. ఎందుకంటే దోసకాయ రసంలో 'సి' విటమిన్, అల్లంలో 'పొటాషియం, మెగ్నీషియంలు వుంటాయి. అలోవీరలో మన శరీరానికి ఎంతమేర పోషక పదార్థాలు వుండాలో అంతవరకే వుంచి మిగతా వాటిని బయటకు పంపే గుణం వుంది. ఈ సులభమైన సూత్రాలను నిష్టగా పాటించి, గుండె జబ్బులు రాకుండా చేసుకుంటారని ఆశిస్తోంది 'పల్లెసృజన'.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

ఎడిటర్ గారికి,

గత సంచిక 'పల్లెసృజన' లో ప్రచురించిన 'జీవిత చక్రం' అనే కథ చాలా ఆదర్శంగా ఉంది. ఇలాంటి కథలను తల్లిదండ్రులు, తాతలు చిన్న పిల్లలకు వినిపించ గలిగితే వారిలో ఉన్నత భావాలు పెంపొందే అవకాశం వుంటుంది. ఈ కథను చదవటం వల్ల నాకెంతో ఆనందం కలిగింది. ఇలాంటి కథలను ప్రచురిస్తున్న 'పల్లెసృజన' బృందానికి ధన్యవాదములు.

– ఎలగందుల నర్సింహ, ఫేస్‌బుక్ ద్వారా

ఎలగందుల నర్సింహ గారూ,

మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీలాంటివారు 'పల్లెసృజన' విస్తరించేందుకు కృషి చేస్తారని ఆశిస్తున్నాము. – ఎడిటర్.

పల్లెసృజన బృందానికి,

అభినందనలు. మీరు ఎన్నో రకాల పునాది స్థాయి ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వస్తున్నారు. వాటిని ఫేస్‌బుక్‌లో చూసినప్పుడల్లా మీరు చేస్తున్న అనిర్వచనీయమైన స్వచ్ఛంద సేవలకు నేను ముగ్ధుడనౌతున్నాను. ఇంత సింపుల్ టెక్నాలజీతో తయారైన ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లు రైతాంగంలోకి అనుకున్నంతగా చొచ్చుకు పోవటం లేదేమోనని నా అభిప్రాయం. ఈ సింపుల్ టెక్నాలజీ పనిముట్లు ఉపయోగించటం వల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారు పనులు చేసుకోవచ్చు కదా. వీటికి సరైన ప్రచారం కల్పించి ప్రతి గ్రామానికి మీ ఇన్నోవేషన్లు చేరేలా చేస్తే బావుంటుందేమోనని నా అభిప్రాయం.

– సోము కొక్కు, ఫేస్‌బుక్ ద్వారా

సోము గారికి,

మీ ఉద్దేశ్యాన్ని మేము ఏకీభవిస్తున్నాము. పల్లెసృజన స్వచ్ఛందంగా ఎంత చేయాల్నో అది చేస్తోంది. ఇంకా ఎక్కువగా చేయాలంటే మీలాంటి వారు ముందుకు రావాల్సి. సమాజంలోకి ఇంకా చొచ్చుకుపోవాలంటే ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, మీలాంటి స్వచ్ఛంద వాలంటీర్లు ముందుకు వస్తే, పునాదిస్థాయి ఇన్నోవేషన్లు విరివిగా ప్రజల్లోకి చొచ్చుకుపోతాయి. – ఎడిటర్

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# రైతుల కోసం రైతులు తయారు చేసిన

# వ్యవసాయ పరికరాలు



సోలార్ స్ప్రేయర్

## క్విక్ ప్లాంటర్

పల్లెసృజన

- మిరప, ఇతర కూరగాయల నారలు నాటేందుకు సులభంగా, ఎలాంటి నడుపు నొప్పి లేకుండా నాటుకోవచ్చు.
- నారలు నాటేందుకు అయ్యే కూలీల ఖర్చు ఆదా.
- పొలమంతటా సమానమైన లోతులో నారలు నాటుకోవచ్చు.
- మల్చింగ్ పేపర్‌పైన నారలు నాటుకుంటే చెట్టు చుట్టూ కలుపు లేకుండా మొక్క పెరుగుతుంది.
- అమ్మకానికి సిద్ధంగా వున్నాయి.
- వెల రూ. 3,000/-, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు అదనం.



మహిళా ఇన్నోవేటర్ తయారు చేసిన

## మూలికలతో శుభ్రపరిచే ద్రావణాలు

పల్లెసృజన





- మార్కెట్లో లభించే యాసిడ్లు, హానికర రసాయనాలతో తయారైన వివిధ రకాల శుభ్రపరిచే ద్రావణాలకు విరుగుడు చూపిన ఒక సాధారణ గృహిణి.
- ప్రకృతిలో లభించే మూలికలు, చెట్ల ఆకులు, బెరడులతో సహజ సిద్ధంగా తయారు చేయబడినవి.
- వాతావరణానికి, ఉపయోగించే వారికి ఎలాంటి హాని చేయవు.
- వెండి, రాగి, ఇత్తడి, కంచు, పంచలోహ వస్తువులను శుభ్రపరిచేవి.
- గదిలో బండలు, టైల్స్, స్నానపు గదులు, శుభ్రపరిచేవి.
- నూనె మరకలు గల వంట గదిలోని టైల్స్ శుభ్రపరిచేవి.
- రసాయనాలతో శుభ్రపరిస్తే వచ్చే మంటలు, దురదలు, చర్మ వ్యాధులు, అలర్జీలకు ముగింపు.
- ఈ మూలికా ద్రావణాలను ఉపయోగించుకుని, ఆరోగ్యం, పర్యావరణాం కాపాడుకోండి.
- పేటెంటుకు దరఖాస్తు చేయబడినవి.
- అమ్మకానికి సిద్ధంగా వున్నాయి.



గడ్డిని కత్తిరించే పరికరం



యూరియా వెదజల్లే యంత్రం

నిమటోడ్స్ నివారణకు సేంద్రియ మందు

## శ్రీ నిమాట్

పల్లెసృజన

- మిరప, వేరుశనగతో పాటు దాదాపు అన్ని పైర్లను ఆశించే 'నులిపురుగు' (నిమటోడ్స్) నివారణకు అద్భుతమైన ఔషధం.
- విజయవంతంగా ప్రయోగించబడి, అద్భుతమైన ఫలితాన్ని చవిచూశారు ఎంతోమంది రైతులు.
- జామ, నిమ్మ లాంటి పెద్ద పెద్ద వృక్షాలు కూడా ఈ పురుగు బారిన పడి నిట్ట నిలువుగా ఎండిపోతాయి.
- ఈ మందు తయారు చేసిన ఇన్నోవేటర్ ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారం అందుకున్నాడు.
- అమ్మకానికి సిద్ధంగా వున్నాయి.
- వెల లీటరుకు రూ. 850/-, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు అదనం.





కావాల్సిన వారు సంప్రదించండి :

**పల్లెసృజన**

ప్లాట్ నెం. 77, రోడ్ నెం.2, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

**ఫోన్ : 040-27111959, 9652801700, 8125799904**

PALLESRUJANA Telugu Bi-monthly Sept.-Oct. 2018 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**


























**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 350/- | 1,400/- |
| ఐదు సంవత్సరాలకి | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904